

చందనోత్సవంపై నేడు మంత్రుల సమావేశం

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం మంత్రుల సమావేశం జరగనుంది. ఈ నెల 30న సింహాచలంలో వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం జరగనున్న సంగతి తెలిసిందే. ఆ ఉత్సవాన్ని ఎలా నిర్వహించాలి? ఏర్పాట్లు ఏమిటనే అంశాలపై చర్చించడానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నగరానికి వచ్చారు. ఈ సమావేశం కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వస్తున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుంది.

ఉక్కులో ప్రి మెచ్యూర్ రిటైర్‌మెంట్

50 ఏళ్లు దాటిన ఉద్యోగులకు మూడు నెలల జీతం చేతిలో పెట్టి ఇంటికి పంపుతోన్న యాజమాన్యం

- 12వ తేదీ నుంచే ఉత్తర్వులు జారీ
- 'పబ్లిక్ ఇంట్రెస్ట్' అంటూ కొత్త భాష్యం
- గతంలో ఏదో ఒక సందర్భంలో షోకాజ్ అందుకున్నవారు, క్రమశిక్షణ చర్యలకు గురైనవారే టార్గెట్



విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం అంతా తాను అనుకున్నట్టుగానే చేస్తోంది. ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా నిర్ణయాలు తీసుకుంటోంది. స్వచ్ఛంద పదవీ విరమణ ద్వారా సుమారు 1,200 మందిని శాశ్వతంగా ఇంటికి పంపించేసిన యాజమాన్యం ఇప్పుడు 'ప్రిమెచ్యూర్ రిటైర్‌మెంట్' పేరుతో 50 ఏళ్లు దాటిన వారికి మూడు నెలల జీతం ఇచ్చి ఉద్యోగం నుంచి తొలగిస్తోంది. ఈ తరహా ఉత్తర్వులు ఈ నెల 12వ తేదీ నుంచే ఉద్యోగులకు జారీచేస్తోంది. దీనికి గాను ఆయా ఉద్యోగులు సరిగ్గా పనిచేయడం లేదని 'ఇనెఫిషియెన్సీ' ముద్ర వేస్తోంది. సంస్థ కాండక్ట్, డిసిప్లిన్ అండ్ అప్పీల్ నిబంధనలు క్లాస్ 4.0 (సి) ప్రకారం మూడు నెలల జీతం ఇచ్చి తొలగించే అధికారం ఉందని, ఉత్తర్వుల్లో పేర్కొంటోంది. ఇప్పటికే కొందరికి ఈ ఉత్తర్వులు అందాయి.

అనేక విమర్శలు

ప్రి మెచ్యూర్ రిటైర్‌మెంట్ విధానంపై అనేక విమర్శలు వస్తున్నాయి. గతంలో ఎప్పుడో తప్పు చేశారని, షోకాజ్ నోటీసులు అందుకున్న వారిని, క్రమశిక్షణ చర్యలకు గురైన వారిలో 50 ఏళ్లు దాటిన వారిని ఈ పద్ధులో తీసేస్తున్నారు. దీనికి 'పబ్లిక్ ఇంట్రెస్ట్' అని ప్రత్యేకంగా పేర్కొంటున్నారు. ఉక్కు ఉత్పత్తి అనేది అంతా కలిసి చేసే పని. ఒక్కరు గట్టిగా పనిచేస్తేనే, చేయకపోతేనో ఆగిపోయేది కాదు. స్టీల్ ప్లాంటు ఉద్యోగుల తొలగింపునకు 'పబ్లిక్ ఇంట్రెస్ట్' అని పేర్కొనడాన్ని అధికారులు తప్పుపడుతున్నారు. పైగా ఎప్పుడో చేసిన తప్పులకు జీతాల్లో కోత వంటి శిక్ష అనుభవించిన వారిని మళ్లీ ఇప్పుడు 'మీకు 50 ఏళ్లు వచ్చేశాయి... వెళ్లిపోండి' అనడం ఏ విధంగా ... మిగతా 6వ పేజీలో

కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె వాయిదా

- రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్య ప్రతినిధులు, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల మధ్య చర్చలు
- మే 20 వరకూ కార్మికులెవరినీ తొలగించబోమన్న యాజమాన్యం



మినిట్స్ పత్రాలను చూపుతున్న ఆర్‌ఎల్‌సీ, ఉక్కు అధికారులు, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు గురువారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మె వాయిదా పడింది. బుధవారం రాత్రి నగరంలో ఆర్‌ఎల్‌సీ (రీజినల్ లేబర్ కమిషనర్) మొహంతి సమక్షంలో ఉక్కు యాజమాన్య ప్రతినిధులు, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల మధ్య చర్చలు జరిగాయి. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించరాదని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ ఇవ్వకపోతే గురువారం నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని స్పష్టంచేశారు. అయితే ... మిగతా 6వ పేజీలో

గ్రేటర్‌లో మారుతున్న సమీకరణాలు



- వైసీపీ నుంచి జనసేనలోకి ముగ్గురు కార్పొరేటర్లు
- 75కి చేరిన కూటమి బలం
- మేజిక్ ఫిగర్ దాటడంతో 19న అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని నేతల విశ్వాసం
- మరోవైపు కూటమి కార్పొరేటర్లతో వైసీపీ సంప్రతింపులు జరుపుతున్నట్టు ప్రచారం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానానికి ముహూర్తం దగ్గరపడుతున్నకొద్దీ కౌన్సిల్‌లో సమీకరణాలు మారుతున్నాయి. వైసీపీ కార్పొరేటర్లు ముగ్గురు తాజాగా జనసేనలో చేరిపోవడంతో అవిశ్వాసం నెగ్గేందుకు కావాల్సిన మేజిక్ ఫిగర్‌ను కూటమి దాటినట్టేనని అంతా అనుకున్నారు. అయితే కూటమిలో కొందరు కార్పొరేటర్లు అసంతృప్తితో ఉన్నట్టు తెలిసి ఇప్పుడు నేతలు ఆందోళన చెందుతున్నారు.

నాలుగేళ్ల కిందట జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ అత్యధిక వార్డులను గెలుచుకోవడంతో మేయర్‌గా గొలగాని హరివెంకటకుమారిని ఎంపిక చేశారు. అయితే గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం దక్కించుకోవడంతో కౌన్సిల్‌లో బలాబలాలు తారుమారయ్యాయి. వైసీపీకి చెందిన కార్పొరేటర్లు 30 మంది టీడీపీ, జనసేన, బీజేపీలో చేరిపోయారు. అలాగే అప్పటివరకూ వైసీపీకి మద్దతు ఇచ్చిన ముగ్గురు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు ప్రస్తుతం టీడీపీ, జనసేన వైపు చేరారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో మేయర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌కు నోటీస్ ఇవ్వగా, ఈనెల 19న ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ నుంచి ప్రకటన రాగానే వైసీపీ నేతలు తమ కార్పొరేటర్లను బెంగళూరు, శ్రీలంక క్యాంపులకు తరలించారు. అవిశ్వాసం నెగ్గాలంటే ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలుపుకుని కూటమికి 74 మంది సభ్యులు అవసరం. కానీ కూటమి వద్ద ... మిగతా 6వ పేజీలో

ఓటింగ్‌కు వామపక్షాలు దూరం

అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 19న జరగనున్న సమావేశానికి హాజరుకాబోమని సీపీఎం, సీపీఐ నేతల ప్రకటన

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజోతి): జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీస్‌పై ఈనెల 19న జరిగే కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు హాజరుకారని రెండు పార్టీల నేతలు ప్రకటించారు. జగదాంబ జంక్షన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానాలకు సంబంధించిన ఓటింగ్‌లోనూ పాల్గొనకూడదని నిర్ణయించుకున్నామన్నారు. ఏపీకి బీజేపీ తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంటు సహా అనేక ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటీకరిస్తోందని విమర్శించారు. అలాంటి బీజేపీతో టీడీపీ, జనసేన కలిసి కూటమిగా కొనసాగడం రాష్ట్రానికి ప్రధానంగా జిల్లాకు తీరని నష్టం కాబట్టి అలాంటి కూటమి నిర్ణయాల్లో భాగస్వామ్యులు కావడం తమ కు ఇష్టం లేదన్నారు. ప్రజల పక్షాన పోరాడే సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు ప్రస్తుతం జీవీఎంసీలో ఏ పార్టీని బలపరిచేపరిస్థితి లేదన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కార్పొరేటర్లను అవినీతి సరకుగా మార్చేసిన టీడీపీ, వైసీపీలను తిరస్కరించాలని నగరవాసులను కోరుతున్నామన్నారు.




సమావేశంలో వామపక్షాల నేతలు

ప్రభుత్వాస్పత్రుల్లో సేవలపై ఆరా

గడిచిన నాలుగు నెలల నుంచి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న సర్కారు

- వైద్యులు, సిబ్బంది పనితీరు, మందుల సరఫరా, అవినీతి, పరిశుభ్రతపై ఐవీఆర్‌ఎస్ ద్వారా సమాచారం సేకరణ
- జిల్లాలోని ఆస్పత్రుల్లో పారిశుధ్య నిర్వహణపై పెదవివిరుపు
- అవినీతి ఉందన్న 41 శాతం మంది...
- ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించేలా ఆదేశాలు



విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):

ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందుకోసం ప్రభుత్వం ఆస్పత్రుల్లో ప్రధానంగా నెలకొన్న సమస్యలు, అందుతున్న సేవలపై ప్రజలకు ఫోన్ చేసి అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది.

గడిచిన నాలుగు నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి నెలా ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తోంది. జిల్లాలో ప్రధానంగా కేజీహెచ్, ఈఎన్‌టీ, మానసిక వైద్యశాల, ఘోషా ఆస్పత్రి, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, విమ్స్ ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవల గురించి ప్రభుత్వం ఎప్పటికప్పుడు తెలుసుకుంటోంది. నెలవారీ నివేదికల ఆధారంగా చేసుకుని ఆయా ఆస్పత్రుల అధికారులను అప్రమత్తం చేస్తోంది.

ప్రజాభిప్రాయ సేకరణ ప్రశ్నలు ఇవే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలకు సంబంధించి ఐవీఆర్‌ఎస్ ద్వారా కొన్ని అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతున్నారు. వీటిలో ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా?, డాక్టర్ ప్రవర్తన ఎలా ఉంటోంది?, సిబ్బంది ప్రవర్తన ... మిగతా 6వ పేజీలో

రైళ్లు రద్దు, రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలో నిర్మాణ పనుల రీత్యా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే కొన్నింటి గమ్యాలను కుదించామని, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేశామని పేర్కొన్నారు.

రద్దైన రైళ్లు: ఈ నెల 22, 29, మే 4న విశాఖ-కొరాపుట్ పాసింజర్ (58538), కొరాపుట్-విశాఖ పాసింజర్ (58537), విశాఖ-రాయపూర్ పాసింజర్ (58528), 23, 29, మే 5 తేదీల్లో రాయపూర్-విశాఖ పాసింజర్ (585227), 28న విశాఖ-కొరాపుట్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18512), 29న కొరాపుట్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18511)

రీ షెడ్యూల్: ఈ నెల 22న విశాఖ-నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ (12807), 21న నాందేడు-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810), మే 3న ఎర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్లలో గంటన్నర ఆలస్యంగా, 28న బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524) గంట ఆలస్యంగా బయలుదేరనున్నాయి.

గమ్యం కుదింపు

ఈ నెల 21, 28, మే 3 తేదీల్లో గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) గుంటూరు నుంచి విజయనగరం వరకూ, తిరుగు ప్రయాణంలో రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) ఈ నెల 22, 29, మే 4న విజయనగరం నుంచి గుంటూరు వరకూ నడుస్తాయి.

విమానాశ్రయంపై చిన్నచూపు

తగ్గిపోతున్న విమాన సర్వీసులు




- ఈ నెల ఒకటో తేదీ నుంచి నిలిచిపోయిన విజయవాడ ఫ్లైట్స్
- నెలాఖరు నుంచి బ్యాంకాక్, మలేషియా సర్వీస్‌లకు బుకింగ్స్ బంద్
- కార్గో సర్వీసులకు దిక్కు లేని పరిస్థితి
- ఉడాన్ క్యాంటీన్‌కు కూడా నోచుకోని వైనం
- కేంద్ర మంత్రి చొరవ తీసుకోవాలని నగరవాసుల విన్నపం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు దివ్యంగా వెలుగొందిన విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం ఇప్పుడు వెలవెలబోతోంది. భోగాపురంలో ఇంకా కొత్త విమానాశ్రయం నిర్మించకముందే దీనిని నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విశాఖ నుంచి డొమెస్టిక్, ఇంటర్నేషనల్ సర్వీసులు కారణాలు లేకుండా రద్దు అయిపోతున్నాయి. ఎక్కడైనా ఆక్యుపెన్సీ లేకపోతే విమానాలు రద్దు చేస్తారు. కానీ విశాఖలో ఆ సమస్య లేదు. అన్ని విమానాలు 85 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. అయినా పలు సర్వీస్‌లు రద్దు చేస్తున్నారు. విశాఖ నుంచి విజయవాడకు వెళ్లడానికి రోజూ ఉదయం రెండు సర్వీసులు ఉండేవి. వాటిని ఈ నెల ఒకటి నుంచి ... మిగతా 6వ పేజీలో

పోలమాంబకు నీరాజనం



పూజలందుకుంటున్న కరకచెట్టు పోలమాంబ - వార్త 8లో

కిరాతకం

భార్యను, కడుపులో ఉన్న బిడ్డను చంపేసి, పక్కనున్న కుర్చీలో కూర్చుని సెల్ ఫోన్‌తో కాలక్షేపం

- నిండు గర్భిణి హత్య కేసులో నివ్వెరపరచిన నిందితుడి వ్యవహారం
- తొలి నుంచీ వదిలించుకునే యత్నం
- మొదట బ్లడ్ క్యాన్సర్ బారినపడినట్టు నాటకం
- ఆ తరువాత తన కుటుంబ సభ్యులు చంపేస్తారని బెదిరింపు
- అవన్నీ విఫలం కావడంతోనే హత్యకు తెగించిన వైనం



అనూష, జ్ఞానేశ్వర్ (ఫైల్)

- మార్చురీ వద్ద గుండెలు అవిసేలా రోదించిన మృతురాలి కుటుంబ సభ్యులు, స్నేహితులు
- కడుపులో ఆడబిడ్డ... పోస్టుమార్టం సమయంలో గుర్తింపు



విలపిస్తున్న అనూష తల్లి, సోదరి

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణి అనూష (27) హత్య ఉదంతం నగరంలో కలకలం రేపింది. మంగళవారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడకు వచ్చిన కుటుంబ సభ్యులు, స్నేహితులు గుండెలు అవిసేలా రోదించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి భూమిపైనే లేకుండా చేశాడంటూ వాపోయారు. ఆమెను వదిలించుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ప్రాణాలు తీసేందుకు తెగించాడన్నారు. అతడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం...

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలానికి చెందిన అనూష నగరంలోని ఒక కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది. ఆ సమయంలో స్నేహితుల ద్వారా జ్ఞానేశ్వర్ పరిచయమయ్యాడు. స్నేహం కాస్త ప్రేమగా మారింది. వివాహానికి ఆమె ... మిగతా 6వ పేజీలో

జిల్లా పర్యాటక శాఖ అధికారిణిగా మాధవి

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరక్టర్‌గా పనిచేస్తున్న జె.మాధవిని జిల్లా పర్యాటక శాఖ అధికారిణిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు డీటీఓగా వ్యవహరిస్తున్న సుధా సాగర్ హెచ్‌పీసీఎల్ భూసేకరణ విభాగం అధికారిగా వెనక్కి వెళతారు. గతంలో డీటీఓగా వ్యవహరిస్తూ రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న జ్ఞానవేణిని ఎన్‌హెచ్-16 భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు.

నేడు జడ్పీ సమావేశం

మహారాణిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ జి.సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న జరుగుతుందని సీఈవో నారాయణమూర్తి తెలిపారు.

కళానగర్ ఓటర్లను 7వ వార్డులో చేర్చాలి



భీమిలి ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాగోతి శివాజీ తదితరులు

మధురవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని కళానగర్ ఓటర్లను అదే వార్డులో చేర్చాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ భీమిలి ఆర్డీవోకు మంగళవారం వినతిపత్రం అందించారు. కళానగర్ గ్రామం ఓటర్లు 5వ వార్డు పరిధిలోని నగరంపాలెం బూత్‌లో ఓట్లు వేయ వలసి వస్తోందని, దీన్ని మార్పు చేసి 7 వ వార్డులో ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని శివాజీ కోరారు.

చల్లబడిన భీమిలి

భీమునిపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భీమిలిలో మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతారణం చల్లబడింది. మధ్యాహ్నం మబ్బులతో కూడిన తేలికపాటి వర్షపు జల్లులు కురిశాయి. సాయంత్రం వరకూ చల్లటి ఈదురుగాలులు వీశాయి. దీంతో ఇప్పటివరకూ ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఇబ్బంది పడిన జనాలు చల్లదనంతో సేద తీరారు.



పూజల్లో పాల్గొన్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పోలమాంబను దర్శించుకున్న అనకాపల్లి ఎస్పీ

ఎండాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదాన ప్రాంగణంలో ఉన్న పోలమంబ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మంగళవారం పాల్గొన్నారు. తొలుత ఎస్పీకి ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసరాలను తుహిన్‌సిన్హా పరిశీలించి ఆలయ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు నీరు, నీడ ఏర్పాటు చేయాలి

అధికారులకు పలువురు విజ్ఞప్తి

పద్మనాభం-రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు, నీడ వసతులను కల్పించాలని పలు గ్రామాలకు చేందిన ఉపాధి కూలీలు కోరుతున్నారు. మే, జూన్ నెలల్లో ఎండలు అధికంగా ఉంటాయని, అటువంటి సమయంలో పనులు చేయడం ఎంతో కష్టతరంగా ఉంటుందన్నారు. అందువల్ల కనీసం నీరు, నీడను ఏర్పాటు చేసేందుకు అధికారులు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశంలో కూలీలు చెట్ల నీడల్లో కాసేపు ఉంటూ ఉపశమనం పొందుతున్నారు. అందువల్ల వేసవి తీవ్రత దృష్ట్యా అధికారులు పని ప్రదేశంలో తాగునీరు, నీడ కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఇదిలావుండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన మస్తర్లు విధానాన్ని అమలు చేయాల్సి ఉన్నప్పటికీ కొంతమంది వీఆర్పీలు పాత పద్ధతిలోనే మస్తర్లు వేయడం సమంజసం కాదని పలువురు వాపోతున్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో వీఆర్పీలు అధికారుల అండదండలతో చేతివాటం ప్రదర్శిస్తూ పనులకు హాజరు కానివారికి సైతం మస్తర్లు వేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బొడ్డపాలెంలో పోషణ్ పక్వాడా



హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆనందపురం, ఏప్రిల్ 15 : మండలంలోని వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీపీడీవో ఎం.శ్రీదేవి మాటాడుతూ గర్భిణులు పోషక విలువలతో కూడిని ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వడం జరుగుతుందని సూచించారు. వెయ్యి రోజులు.. అనగా గర్భిస్త దశ నుంచి రెండేళ్ల వరకూ అంగన్‌వాడీ సూచించిన ఆహారపు అలవాట్లు పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. లబ్ధిదారులు స్వయంగా తమంతట తామే పోషణ ట్రాక్ చేరి వినియోగించుకోవాలన్నారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం అమలు చేయడం ద్వారా పిల్లలలో పోషకాహార లోపం నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా తల్లులందరికీ హ్యాండ్ వాష్‌పై 7 స్టెప్స్‌ను వివరించడంతో పాటు ప్రాక్టికల్‌గా తల్లులతో చేయించారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్‌పీవీవీ రత్నం, కార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ మందిరాల్లో హోలీవీక్ ప్రార్థనలు

మధురవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లోహోలీవీక్ (పవిత్ర వారం) ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఆదివారం మట్టల ఆదివారం (పామ్‌సండే)తో ప్రారంభమైన ఈ ప్రార్థనలు శుభ శుక్రవారం తరువాత వచ్చే ఈస్టర్ వరకు కొనసాగుతాయి. గుడ్‌ఫ్రైడేను జీసస్ శిలువ వేసే రోజుగా పరిగణిస్తారు. ఆదివారం ఈస్టర్‌ను జీసస్ తిరిగి పునర్జీవనం పొందుతారని క్రైస్తవ సోదరులు భావిస్తారు. హోలీవీక్ సందర్భంగా మధురవాడ, స్వతంత్రనగర్, మిథిలాపురి వుడా కాలనీ తదితర ప్రాంతాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక సందడి నెలకొంది.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు

పద్మనాభం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. నేలలో పోషకాలు పెంపొందించి ఆరోగ్యవంతమైన పంటలు పండించడానికి ఈప్రకృతి సేద్య పద్ధతులను ప్రతీ రైతు అవలంబించాలని మాస్టర్ ట్రైనర్లు వివరించారు. తక్కువ నిర్వహణ వ్యయంతో అధిక లాభాలను ఈ విధానం ద్వారా పొందడమే కాకుండా ఆరోగ్యకరమైన పంటను అందించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాన్ని అభ్యసిస్తూ ప్రకృతికి హితం, మానవునికి మేలు చేస్తున్న ఎల్. మంగ, బి.వెంకటరావు అనే ఆదర్శ రైతులను ఘనంగా సత్కరించారు. ప్రకృతి వ్యవసాయం అవలంభించి వారు పొందిన ప్రయోజనాన్ని తోటి రైతులకు వివరించారు.

కార్యక్రమంలో స్థానిక నాయకులు బుగత సత్యనారాయణ, కాళ్ల నగేష్‌కుమార్, సన్యాసినాయుడు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది బాలామణి, విద్యాసాగర్, పైడితల్లి, ఉష, అప్పలనాయుడు, యశోద, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానిస్తున్న అధికారులు

'గీతం'లో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

సాగర్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అధునాతన ఉపకరణాలతో పాటు 3డీ ప్రింటింగ్, డ్రిల్లింగ్, కటింగ్, గ్రైండింగ్ పద్ధతులను విద్యార్థులు ఉపయోగించి ఐరన్, ప్లాస్టిక్, చెక్కతో సాంకేతిక ఉత్పత్తులను రూపొందించి చూపరులను అబ్బురపరిచారు. సుమారు 160 మంది విద్యార్థులు బృందాలుగా ఏర్పడి 50కి పైగా సాంకేతిక ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. అగ్ని ప్రమాదాలలో రక్షించే రోబోట్, అంధులకు మార్గం చూపించే పరికరాలు, దివ్యాంగులకు ఉపకరించే అధునాతన వీల్‌చైర్, ఆకర్షణీయ వ్యవసాయ ఉపకరణాలు, పనిముట్లు, తీర ప్రాంతాల పరిశుభ్రతకు ఉపయోగించే యంత్రాలు, వరద ముప్పును గుర్తించే పరికరాలు, వంతెనలు, స్మార్ట్ పార్కింగ్, సౌర యంత్రాలను శుభ్రపరిచే సామగ్రి, తదితన నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. అత్యుత్తమ నమూనాలను ఎంపిక చేసి నగదు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. గీతం వీసీ డాక్టర్ ఎరోల్ డిసౌజా ఈ ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రోవైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.రాజేశ్వరరెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న పాఠశాలల విద్యార్థులు



విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాని అందజేస్తున్న వీసీ

పక్షుల కోసం గ్రాసం ఏర్పాట్లు



వేసవిలో ఆహారం కోసం పక్షులు ఇబ్బంది పడకుండా ధాన్యపు గుత్తులను ఏర్పాటు చేసేందుకు తీసుకువెళుతున్న ప్రతినిధులు..పక్కన ఓ చెట్టుకు కట్టిన ధాన్యపు గుత్తు

భీమునిపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో పక్షులు ఆహారం కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను మిషన్ గ్రీన్ భీమిలి, ఫ్రెండ్స్ అసోషియేషన్ సభ్యులు సంయుక్తంగా మంగళవారం పలు చోట్ల ధాన్యపు గుత్తులను ఏర్పాటు చేశారు. పక్షులు ఎక్కువగా సంచరించే బీచ్ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు థీమ్ పార్కు, పావురాల పార్కు, తీరంలోని కొబ్బరి చెట్లకు వీటిని వేలాడదీశారు. వేసవిలో పక్షులు డీహైడ్రేషన్ బారినపడకుండా ఉండేందుకు ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద, డాబాలపై ఒక గిన్నెలో మంచి నీళ్లు పెట్టాలని వారు కోరారు. జీవ వైవిధ్యంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మిషన్ గ్రీన్ భీమిలి సభ్యులు డాక్టర్ ఆదిత్య, గుల్లల వెంకటేశ్, ఫ్రెండ్స్ అసోషియేషన్ సభ్యులు మైలపల్లి షణ్ముఖరావు, కె.సన్నీ, పి.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్, బూర శ్రీనివాసరావు, కె.అశోక్, పి.దేవానంద్, గోపి, దొర, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

- వృద్ధురాలి ఆవేదన

ఎండాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న వాణిజ్య నిర్మాణానికి సంబంధించి సెట్ బ్యాక్‌లు లేకుండా మూడు అడుగుల వరకు రోడ్డును ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేపట్టారని, దీనిపై ఇటీవల జోన్-2 ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని 78 ఏళ్ల వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య భవనంలో బిర్యానీ దుకాణాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, వెనక భాగంలో వేసిన షెడ్డులో వంట పనులు చేస్తుండడం వల్ల వచ్చే పొగతో తాను తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఫిర్యాదులో పేర్కొన్నానని ఆమె తెలిపారు. ఇప్పటికైనా జోన్ అధికారులు స్పందించికపోతే ఈ సమస్యను జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళతానని ఆమె పేర్కొన్నారు.

సుత్తమ్మతల్లి ఆలయ పునరుద్ధరణకు చర్యలు

17న పనులు ప్రారంభం



చిప్పాడలో పురాతనమైన సుత్తమ్మతల్లి ఆలయం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పాడలో పురాతనమైన సుత్తమ్మతల్లి ఆలయాన్ని పునరుద్ధరించేందుకు గ్రామస్థులు తీర్మానించారు. ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 9.38 గంటలకు పనులు చేపట్టడానికి ముహూర్తాన్ని నిర్ణయించారు. చిప్పాడ పరిసరాల్లోని 14 గ్రామాల ప్రజలు సుత్తమ్మతల్లిని ఇలవేల్పుగా కొలుస్తారు. అయితే శిథిలమైన సుత్తమ్మతల్లి ఆలయాన్ని పార్టీలకతీతంగా ఆధునీకరించేందుకు గ్రామస్థులు నిర్ణయించారు.

ఉక్కులో 'ప్రి మెచ్యూర్ రిటైర్‌మెంట్'

... 5వ పేజీ తరువాయి

న్యాయమని ప్రశ్నిస్తున్నారు. గతంలో రిటైర్‌మెంట్ వయస్సు 58 ఏళ్లుగా ఉండగా, ఉద్యోగుల అనుభవం అవసరమని నాటి ప్రధాని వాజపేయి రిటైర్‌మెంట్ వయసును 60 ఏళ్లకు పెంచారని, ఇప్పుడు వారికి జీతాలు ఇవ్వడం ఇబ్బందిగా ఉందని, ఏకంగా పదేళ్లు తగ్గించేసి 50 ఏళ్లకే ఇంటికి పంపడం దారుణమని విమర్శిస్తున్నారు. ఈ నిర్ణయాలను ఎవరైనా వ్యతిరేకిస్తే వారిని కూడా ఇంటికి పంపించేయాలని చూస్తున్నారని పలువురు వాపోతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె వాయిదా

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో సరిగా పనిచేయని వారిని, విధులకు హాజరుకాని వారిని మాత్రమే తొలగిస్తామని, ఆ స్థానంలో ఇప్పటికే తొలగించిన 1,503 మందిలో బాగా పనిచేసే వారిని తిరిగి తీసుకుంటామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.కాంట్రాక్టు కార్మికుల తొలగింపును రెండు నెలల పాటు వాయిదా వేయాలని, ఈలోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని కార్మిక నాయకులు కోరగా...మే 20వ తేదీ వరకు ఎవరినీ తొలగించబోమని యాజమాన్యం హామీ ఇచ్చింది. దీంతో కార్మిక నిరవధిక సమ్మెను మే 20వ తేదీ వరకు వాయిదా వేస్తున్నామని కార్మిక సంఘ నాయకులు ప్రకటించారు. ఇదిలావుండగా మే 20వ తేదీలోపు మరోసారి ఆర్ఎల్‌సీ సమక్షంలో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్‌ల అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది.

ఈ చర్చల్లో స్టీల్‌ప్లాంట్ అధికారులు గాంధీ, ఖర్, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మంత్రి రవి, నీరుకొండ రామచంద్రరావు, కె.వంశీకృష్ణ, సోంబాబు, శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సేవలపై ఆరా

... 5వ పేజీ తరువాయి

ఎలా ఉంటుంది?, మీకు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా?, అవినీతి ఉందా?, పరిశుభ్రత ఎలా ఉందన్న...ప్రశ్నలు వేసి సమాధానాలను రాబడుతున్నారు.

కొన్నింటిపై ప్రజల్లో అసంతృప్తి

ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా? అనే ప్రశ్నకు జనవరిలో 66 శాతం మంది ప్రజలు అవును అని సమాధానం చెప్పగా, 34 శాతం మంది ఉండడం లేదన్నారు. ఫిబ్రవరిలో 79.44 మంది ఉంటున్నారని, 20.56 శాతం మంది ఉండడం లేదని, మార్చిలో 72.4 శాతం మంది అందుబాటులో ఉన్నారని చెప్పగా, 27.6 శాతం మంది ఉండడం లేదని, ఏప్రిల్‌లో 10వ తేదీ వరకు74 శాతం మంది ఉంటున్నారని చెప్పగా, 26 శాతం మంది ఉండడం లేదని స్పష్టం చేశారు. డాక్టర్ ప్రవర్తన ఎలా ఉందన్న ప్రశ్నకు...జనవరిలో 65.39 శాతం మంది బాగుందని సమాధానం చెప్పగా, 34.01 శాతం సరిగా లేదన్నారు. ఫిబ్రవరిలో 68 శాతం మంది బాగుందని, 32 శాతం మంది బాగాలేదని, మార్చిలో 72 శాతం మంది బాగుందని, 28 శాతం మంది బాగాలేదని చెప్పారు. ఏప్రిల్‌లో 71 శాతం మంది బాగుందని, 29 శాతం మంది బాగాలేదన్నారు. సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందన్న ప్రశ్నకు జనవరిలో 63.91 శాతం మంది బాగుందని చెప్పగా, 36.09 శాతం బాలేదని సమాధానమిచ్చారు. ఫిబ్రవరిలో 64.36 శాతం మంది బాగుందని, 35.64 శాతం మంది బాగాలేదని, మార్చిలో 62.28 శాతం మంది బాగుందనగా, 37.72 శాతం మంది బాలేదని, ఏప్రిల్‌లో 64 శాతం మంది బాగుందని చెబితే...36 శాతం మంది బాగుండడం లేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా.? అన్న ప్రశ్నకు జనవరిలో 57 శాతం మంది ఇచ్చారని చెప్పగా, 43 శాతం మంది ఇవ్వలేదన్నారు. ఫిబ్రవరిలో 61.77 శాతం మంది ఇచ్చారని, 38.23 శాతం మంది ఇవ్వలేదన్నారు. మార్చిలో 60.85 శాతం మంది ఇచ్చారని, 39.15 శాతం మంది ఇవ్వలేదని, ఏప్రిల్‌లో 68 శాతం మంది ఇచ్చారంటే, 32 శాతం మంది ఇవ్వలేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఏదైనా అవినీతిని గమనించారా?...అన్న ప్రశ్నకు జనవరిలో 63 శాతం మంది ఉందని చెప్పగా, 37 శాతం మంది లేదన్నారు. ఫిబ్రవరిలో 60 శాతం మంది అవినీతి ఉందంటే, 40 శాతం మంది లేదని, మార్చిలో 49 శాతం మంది ఉందని, 51 శాతం మంది లేదని, మార్చిలో 41 శాతం మంది ఉందని చెప్పగా, 59 శాతం మంది లేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశుభ్రత ఎలా ఉందన్న ప్రశ్నకు జనవరిలో 60 శాతం బాగుందని చెప్పగా, 40 శాతం మంది బాగాలేదని, ఫిబ్రవరిలో 46 శాతం మంది బాగుందని, 54 శాతం మంది బాగాలేదని, మార్చిలో 43 శాతం మంది బాగుందని, 57 శాతం మంది బాగాలేదని, ఏప్రిల్‌లో 49 శాతం మంది బాగుందంటే, 51 శాతం మంది బాగుండడం లేదని చెప్పారు.

ఇదీ యాక్షన్..

ఆయా ప్రశ్నలకు వచ్చిన సమాధానాలను బట్టి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆస్పత్రి అధికారులు ఎప్పటికప్పుడు సేవలు అందుతున్న తీరును పరిశీలించాలని ఆదేశించింది. విజిలెన్స్ తనిఖీలు నిర్వహించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. డ్యూటీలకు హాజరుకాని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చారు.

ఉత్తమ పనితీరు కనబరిచే వైద్యులు, స్టాఫ్ నర్సులకు అవార్డులు ఇవ్వాలని సూచించింది. మందులు సరఫరా తగినంత ఉండేలా సెంట్రల్ మెడిసిన్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసుకోవాలని ఆస్పత్రులకు సూచించారు. అవినీతిని నిర్మూలించేందుకు విజిలెన్స్ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఇంకా ఆస్పత్రుల్లో ఫిర్యాదులు బాక్సులు ఏర్పాటు చేయాలని, ఎక్కడికక్కడ పోస్టర్స్ ఏర్పాటుచేయాలని ఆస్పత్రి అధికారులకు ఉన్నతాధికారులకు సూచించారు.

కిరాతకం

... 5వ పేజీ తరువాయి

కుటుంబ సభ్యులు అంగీకరించారు. కానీ, జ్ఞానేశ్వర్ మాత్రం తమ కుటుంబ సభ్యుల అంగీకరించరని, పెళ్లి తరువాత చెబుదామని అనూషను ఒప్పించాడు. 2022 డిసెంబరు పదో తేదీన సింహాచలంలో అనూష కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వివాహమైన తరువాత ఎనిమిది నెలలపాటు ఇద్దరూ బాగానే ఉన్నారు. ఆ తరువాత నుంచి జ్ఞానేశ్వర్ అసలు రంగు బయట పడుతూ వచ్చింది. పెళ్లి జరిగిన సుమారు ఏడాదికి తనకు బ్లడ్ కేన్సర్ ఉందని అనూషకు చెప్పాడు. తాను ఎక్కువ కాలం జీవించనని, తనను విడిచి వెళ్లిపోవాలని, నీ జీవితం నాశనం కాకూడదని అన్నాడు. అలా వదిలి వెళ్లబోనని, ఉన్నంత కాలం నీతోనే ఉంటానంటూ అనూష చెప్పినా...అతడు తన ప్రయత్నాలను ఆపలేదు. రక్తపు వాంతులు చేసుకున్నట్టు, తీవ్రమైన నీరసంతో బాధపడుతున్నట్టు నమ్మించే ప్రయత్నం చేశాడు. వైద్యం కోసమంటూ అనూష వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నాడు. ఆ తరువాత అనారోగ్య సమస్యను పక్కనపెట్టి తన కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని, నిన్ను చంపేస్తారంటూ అనూషను భయపెట్టడం మొదలుపెట్టాడు. ఇప్పటికైనా నీదారి నువ్వు చూసుకోవాలంటూ అనూషను వదిలించుకునే ప్రయత్నం చేశాడు. కానీ, అనూష 'నాకు సర్వం నువ్వే. ప్రాణాలు పోయినా నిన్ను వదిలి వెళ్లను' అని చెప్పింది. ఈ క్రమంలోనే అనూష గర్భం దాల్చింది. కొద్దిరోజులు అనూషను బాగానే చూసుకున్నట్టు నటించాడు. నాలుగు రోజుల కిందట ఫలూదా తీసుకువచ్చిఅనూషకు ఇచ్చాడు. తాగే క్రమంలో ఒక టాబ్లెట్ బయటకు రావడంతో ఒక్కసారిగా అనూష షాక్ తింది. టాబ్లెట్ ఉన్న విషయాన్ని జ్ఞానేశ్వర్‌కు చెప్పి షాపునకు వెళ్లి నిలదీద్దామన్నది. దానికి సరేనన్న జ్ఞానేశ్వర్ టాబ్లెట్ పక్కన పెట్టాలని సూచించి బయటకు వెళ్లిపోయాడు. ఇదే విషయాన్ని అనూష కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా చెప్పింది. అప్పుడు కూడా జ్ఞానేశ్వర్‌పై అనుమానం రాలేదు. ప్రసవానికి సమయం దగ్గరపడడంతో ఆదివారం సాయంత్రం డాక్టర్ వద్దకు వెళ్లారు. ఆస్పత్రిలో చేరాలని వైద్యురాలు సూచించారు. అయితే, ఆదివారం ఎందుకు, సోమవారం చేరుదామని చెప్పి అనూషను ఇంటికి తీసుకువెళ్లాడు. అదేరోజు ఉదయం అనూష అమ్మమ్మ తుమ్మలపల్లి అన్నవరం కాకినాడ నుంచి వచ్చారు. రాత్రి ఆస్పత్రి నుంచి వచ్చిన ఇద్దరికీ అన్నం పెట్టింది. ఇద్దరూ రూమ్‌లోకి వెళ్లారు. అనూష అమ్మమ్మ హాల్‌లో పడుకుంది. సోమవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో వాళ్లున్న గదిలోకి అనూష అమ్మమ్మ వెళ్లింది. అప్పటికీ నిద్రలో ఉన్నట్టు కనిపించిన అనూషను తట్టి లేపే ప్రయత్నం చేసింది. ఎంతసేపటికీ లేవకపోవడంతో పక్కనే కుర్చీలో కూర్చుని సెల్‌ఫోన్ చూసుకుంటున్న జ్ఞానేశ్వర్‌తో అమ్మాయి లేవడం లేదు...చూడాలని చెప్పింది. ఏమీ తెలియనట్టు చెంపలపై కొడుతూ లే అనూష.. అంటూ నాటకాలాడే ప్రయత్నం చేశాడు. అనూష లేవడం లేదని, ఏమైందో తెలియడం లేదంటూ అనూష అమ్మమ్మకు చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె ఎదురింటి వాళ్లను పిలిచింది. అనూష స్నేహితులకు జ్ఞానేశ్వర్ విషయాన్ని తెలియజేయడంతో వారంతా ఇంటికి చేరుకున్నారు. తొలుత దగ్గరలోని రెండు ఆస్పత్రులకు కారులో తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో కేర్‌కు తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు చనిపోయిందని నిర్ధారించారు. అనూష తనను విడిచి వెళ్లిపోయిందని, తాను ఎలా బతకాలంటూ జ్ఞానేశ్వర్ నాటకాన్ని రక్తికట్టించే ప్రయత్నం చేశాడు.

గాయాలతో అనుమానం

కేర్ నుంచి అనూషను ఇంటికి తీసుకువెళ్లిపోయేందుకు జ్ఞానేశ్వర్ ప్రయత్నించాడు. అయితే, జ్ఞానేశ్వర్ ముఖం, చేతిపై గాయాలు ఉండడాన్ని గుర్తించిన అనూష స్నేహితుడు ఆదర్శ్‌కు అనుమానం వచ్చింది. తన తల్లిని కేర్ ఆస్పత్రికి రమ్మని చెప్పాడు. ఆమె కేజీహెచ్‌లో పనిచేస్తున్నారు. మెడపై కొన్ని మచ్చలు ఉండడం, శరీరం పూర్తిగా నల్లగా మారిపోవడంతో కేజీహెచ్‌కు తీసుకువెళదామని ఆమె చెప్పారు. దానికి జ్ఞానేశ్వర్ వద్దంటూ వారించే ప్రయత్నం చేశాడు. కానీ, అంతా తీసుకువెళ్లాల్సిందేనని పట్టుబట్టడంతో వారితోపాటు అంబులెన్స్‌లో ఎక్కి కేజీహెచ్‌కు వెళ్లాడు. అక్కడి వైద్యులు కూడా చనిపోయిందని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులు గట్టిగా అడగడంతో తొలుత తానే చంపేశానని చెప్పాడు. ఆ తరువాత ఉరి వేసుకుందని చెప్పాడు.మళ్లీ గట్టిగా అడగడంతో తనకు ఇష్టం లేదని అందుకు చంపేసినట్టు అంగీకరిం చాడు. అమ్మాయికి పెళ్లి జరిగినప్పుడు తనకు ఆరోగ్యం బాలేదని, కోమాలో ఉన్నానని, ఇప్పుడు తన బిడ్డను పూర్తిగా దూరం చేశాడని ఆమె తల్లి పద్మ ఆవేదన వ్యక్తంచేశారు. తన బిడ్డకు ప్రసవం సమయంలో తోడుగా ఉండాలని వచ్చానని, తాను ఇంట్లో ఉండగానే బిడ్డ ప్రాణాలు తీసేశాడని అనూష అమ్మమ్మ అన్నవరం విలపించారు.

అంత్యక్రియలు పూర్తి..

అనూష కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చారు. వారి డిమాండ్ మేరకు అనూషను వారి స్వగ్రామమైన దువ్వాడ తీసుకువెళ్లి వారి కోడలిగా అంత్యక్రియలను నిర్వహించారు. పోయిన ప్రాణాన్ని తాము తీసుకు రాలేకపోయినా వారి ఇంటి కోడలిగా గుర్తింపు తెచ్చుకోవాలని భావించిన అనూషకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించడం ద్వారా ఆత్మశాంతి కలిగించే ప్రయత్నం చేశామని అనూష మరిది స్వరూప్ తెలిపారు. ఇకపోతే, అనూష గర్భంలో ఆడ బిడ్డ ఉన్నట్టు పోస్టుమార్టం సమయంలో తేలింది.

విమానాశ్రయంపై చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

ఆపేశారు. దీనివల్ల వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాగే ఈ నెలాఖరు నుంచి అంతర్జాతీయ సర్వీసులు బ్యాంకాక్, మలేషియాలకు బుకింగ్స్ ఆపేశాయి. ఇక మిగిలింది సింగపూర్ విమానం ఒక్కటే. రాష్ట్రంలో విదేశీయులు ఎక్కువ మంది వచ్చే నగరం తిరుపతి. ఆ తరువాత విశాఖపట్నమే. అలాంటి నగరానికి అంతర్జాతీయ సర్వీసులు రద్దయిపోతున్నాయి. గతంలో ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ విమాన సంస్థలతో చర్చించి గోవా, భువనేశ్వర్, కోయంబత్తూర్, పుణే నగరాలకు విమాన సర్వీసులు వేయించింది. అవన్నీ నిలిచిపోయాయి. ఆకాశ్ ఎయిర్ ముంబై సర్వీస్ నిలిపివేసింది. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా వెలుగొందుతున్న విశాఖ నుంచి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఎయిర్ కనెక్టివిటీ అవసరం. ఈ విషయంలో ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవ తీసుకోవలసి ఉంది. కొత్త విమాన సర్వీసులు తెప్పించాల్సి ఉంది.

ఉడాన్ యాత్రీ కేఫ్‌ల అవసరం

కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయాల్లో ఆహార పదార్థాల ధరలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటి కారణంగా ప్రయాణికులు ఆకలితో ఉండకూడదని ఇటీవల 'ఉడాన్ యాత్రీ కేఫ్'లు ప్రారంభించింది. విమానాశ్రయంలో వీటిని ఏర్పాటు చేసి టీ, కాఫీ, టిఫిన్ ఏదైనా 20 రూపాయలకే ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ఇటువంటి క్యాంటీన్‌ను ఇటీవలె చెన్నై విమానాశ్రయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. విశాఖ విమానాశ్రయంలో రెండు ఇడ్లీ రూ.180కి విక్రయిస్తున్నారు. టీ లేదా కాఫీ తాగితే రూ.100 చెల్లించాలి. ఇక్కడనుంచి రోజుకు సగటున నాలుగు వేల మంది ప్రయాణిస్తున్నారు. ఇక్కడ కూడా ఆ క్యాంటీన్ అవసరం ఉంది. కానీ మంత్రి ఆ దిశగా ఎటువంటి ప్రయత్నం చేయలేదు.

ఆర్థిక శాఖ మంత్రి చెప్పినా చర్యలు లేవు

విమానాశ్రయాల నుంచి సరకు రవాణా పెంచాలని, వాటిని ప్రోత్సహిస్తామని కొత్త బడ్జెట్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇటీవల ఆమె విశాఖ వచ్చినప్పుడు అపాటా ప్రతినిధులు విశాఖలో మల్టీ టెంపరేచర్ కోల్డ్ స్టోరీజీ సౌకర్యంతో కార్గో గోడౌన్ ఏర్పాటు చేయాలని కోరారు. దానికి ఆమె స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ పంపితే పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. దానిని కూడా కేంద్ర మంత్రి పట్టించుకోలేదు. రాష్ట్రానికి ఆర్థిక రాజధాని అని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం కూడా విశాఖ విమానాశ్రయంపై దృష్టిసారించాల్సి ఉంది.

కేంద్ర మంత్రితోనే సాధ్యం

విశాఖపట్నం విమానాశ్రయం సమస్యలు పరిష్కరించే సత్తా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు మాత్రమే ఉందని అపాటా ప్రతినిధులు నరేశ్‌కుమార్, కుమార్ రాజా, డీఎస్ వర్మ పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆయనకు ఓ లేఖ రాశారు. రద్దయిన సర్వీసులు పునరుద్ధరించాలని కోరారు.

గ్రేటర్‌లో మారుతున్న సమీకరణాలు

... 5వ పేజీ తరువాయి

అప్పటికి 72 మంది సభ్యులు మాత్రమే ఉండడంతో సంఖ్యా బలం పెంచుకోవడంపై నేతలు దృష్టిపెట్టారు. ఈలోగా తమ కార్పొరేటర్లను చేజారకుండా కాపాడుకునేందుకు కొద్దిరోజుల కిందట మలేషియా తరలించారు. వైసీపీకి చెందిన మరో ఇద్దరు కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు సాగించగా, సోమవారం నాటికి ముగ్గురిని కూటమిలోకి చేర్చుకోగలిగారు. దీంతో మేజిక్ ఫిగర్ కంటే ఒకరు అదనంగా ఉండడంతో ఈనెల 19 అవిశ్వాస తీర్మానం నెగ్గడం ఖాయమని కూటమి నేతలు ఊపిరిపీల్చుకున్నారు.

ఆందోళనకు గురిచేస్తున్న అసంతృప్తులు

అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా చేసేందుకు వైసీపీ నేతలు తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. టీడీపీ, జనసేన కార్పొరేటర్ల తోపాటు ఇటీవల ఆయా పార్టీల్లో చేరిన వైసీపీ కార్పొరేటర్లలో అసంతృప్తితో ఉన్నవారిని గుర్తించే పనిలోపడ్డారు. గాజువాక ప్రాంతానికి చెందిన టీడీపీ కార్పొరేటర్ ఒకరు గత కొద్దిరోజులుగా వాట్సాప్‌లో టీడీపీ నేతలకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఆయనతో వైసీపీ నేతలు సంప్రతింపులు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే ఇటీవల జనసేనలో చేరిన మహిళా కార్పొరేటర్ భర్త ఒకరు కూటమి నేతలపై అసంతృప్త గళం విప్పుతున్నట్టు సమాచారం. దీంతో ఆయన్ని కూడా వైసీపీ నేతలు కలిసినట్టు సమాచారం. ఇలాంటి ప్రచారం నేపథ్యంలో ఇప్పుడిప్పుడు ఊపిరిపీల్చుకుంటున్న కూటమి నేతల్లో ఆందోళన మొదలైందంటున్నారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు జీడీఏ, ఈసీయూ, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడి స్కిల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7995013421 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫుట్‌బాల్ టోర్నీకి యశ్వంత్

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ అండర్-20 ఫుట్‌బాల్ టోర్నీకి నగరానికి చెందిన యశ్వంత్ ఎంపికయ్యాడు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగే ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు యశ్వంత్ ప్రాతినిధ్యం వహిస్తాడు. స్ట్రైకర్‌గా చోటు దక్కించుకున్న యశ్వంత్.. రాష్ట్రానికి పతకం సాధించాలని ఆకాంక్షించారు. జట్టు సభ్యులు: విఘ్నేశ్వర్, సాయి శ్రీనివాస్, అర్జున్, శ్రీనివాసుబాబు, మాచెల్, రాజేష్, సేతుమాధవ్, హర్ష, సురేంద్ర బాబు, భరత్‌కుమార్, లక్ష్మీ నరసింహ స్వామి, సయ్యద్ ఖజాఫీర్, రాఘవేంద్ర, యశ్వంత్, రాజేష్, సాహిల్ హుస్సేన్, జ్ఞానదీప్‌లు ప్రాతినిధ్యం వహిస్తారు.


పైపు లైన్ స్ట్రక్చర్ తగిలి పైకి లేచిన డంపర్ ముందు భాగం

స్టీల్‌ప్లాంటులో తప్పిన ప్రమాదం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ విభాగం సమీపంలోని పైపు లైపు లైన్ స్ట్రక్చర్‌ను ఓ డంపర్ ఢీకొంది. ఇందుకు సంబంధించి ఉద్యోగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్ ఫీల్డ్ మిషనరీ విభాగం (ఎఫ్ఎండీ) విభాగానికి చెందిన డంపర్ మెటీరియల్‌ను కోక్-ఓవెన్ విభాగం సమీపంలోని అన్‌లోడ్ చేసి బాడీని కిందకు దించకుండా బయలుదేరింది. ఈ క్రమంలో కోక్ ఓవెన్ విభాగం సమీపంలోని పైపు లైన్ స్ట్రక్చర్‌ను ఢీకొంది. అయితే పైపు లైన్‌కు ఎటువంటి డ్యామేజీ జరగలేదు. దీంతో ఉద్యోగులు అక్కడకు చేరుకుని డంపర్ వెనక భాగాన్ని కిందకు దించారు. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సినిమా గైడ్

● గుడ్, బ్యాడ్, అగ్లీ : శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)

● జాక్ : జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),

● రాబిన్‌హుడ్ : శ్రీలీలామహల్, గోకుల్,

● మ్యాడ్ : జగదాంబ, శరత్, కన్య (గాజువాక)

● పెళ్ళికాని ప్రసాద్ :శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), వ కౌర్య (గోపాలపట్నం), తాతా(తగరపువలస)

కోర్ట్ : జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు)18, బెండకాయలు 28, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 18, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

జూ పార్కులో విరిగిన బెంచీలు

- సందర్శకులు బడలిక తీర్చుకునేందుకు అవకాశం లేని పరిస్థితి
- నాసిరకం మెటీరియల్ వాడారంటూ విమర్శలు
- రూ.లక్షలాది వృథా అంటూ ఆరోపణలు


జూ పార్కులో బెంచీ విరిగిపోగా కిందిభాగంలో రాళ్లు పెట్టి అమర్చిన దృశ్యం

ఆరిలోవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో సందర్శకులు కూర్చోడానికి అవసరమైన బెంచీలు కరవయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన బెంచీలు విరిగిపోయాయి. దీంతో జూ తిరిగి బడలిక తీర్చుకుందామంటే అవకాశమే లేకుండా పోతోందని సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఏర్పాటు చేసిన బెంచీలు విరిగిపోయాయని, నాసిరకం మెటీరియల్ వాడడమే ఇందుకు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సిమెంటు బెంచీలు విరిగిపోగా, జూ సిబ్బంది వాటి కింద రాళ్లు అమర్చారు. జూ పార్కులో ఈ పరిస్థితిని చూసిన సందర్శకులు నవ్వుకుంటున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సామగ్రి, బెంచీల విషయంలో జూ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి జూ లో నాణ్యత కలిగిన బెంచీలు ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

కరకచెట్టు పోలమాంబను దర్శించుకున్న ప్రముఖులు

- ప్రణవ్‌గోపాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ


తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు. పాల్గొన్న ఎమ్మెల్యే తనయుడు ప్రతాప్‌రుద్ర

సిరిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) :శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయం సమీపంలో మంగళవారం ఉచిత ప్రసాత వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ , టీడీపీ యువ నాయకుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర ప్రారంభించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు చక్ర పొంగలి, పులిహోర ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు వినయ్, రతన్‌కాంత్, విజయ్‌కుమార్, హరీష్‌కుమార్, అభిప్రదీప్, సంతోష్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూర్పు నియోజక వర్గం శాసనసభ్యుడు వెలగ పూడిరామకృష్ణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే తనయుడు ప్రతాప్ రుద్ర తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉచిత ప్రాదం పంపిణీ చేశారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ దంపతులు

చలివేంద్రం ప్రారంభం



మద్దిలపాలెం బస్టాండ్ వద్ద సత్యసాయి సేవా సమితి ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి సేవా సమితి, సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం మద్దిలపాలెం ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభించారు. సత్యసాయిబాబా నూరవ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, సత్యసాయి సేవా సమితి విశాఖ సిటీ కన్వీనర్ డీవీవీఎస్ రాజు ప్రారంభించారు. రెండు నెలల పాటుఈ చలివేంద్రం నిర్వహిస్తామని, గడచిన ముప్పై ఏళ్లుగా ఇలాంటి సేవాకార్యక్రమాలనుచేస్తున్నామని తెలిపారు.

ఆసక్తికరంగా రైల్వే ఫుట్‌బాల్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత ఫుట్‌బాల్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. ఫుట్‌బాల్ అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న టోర్నీలో భాగంగా మంగళవారం తొలి మ్యాచ్‌లో ఆపరేటింగ్ 2-0 గోల్స్‌తో సిగ్నల్ అండ్ టెలికాంపై, రెండో మ్యాచ్‌లో డీజిల్ లోకోషెడ్ 1-0 గోల్‌తో పర్సనల్ శాఖపై విజయం సాధించాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగిన చివరి మ్యాచ్‌లో టీఆర్‌డీ 1-0 గోల్ తేడాతో కమర్షియల్ శాఖపై గెలుపొందింది. ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాసరావు, గణేష్, తిరుమలరావులు ఈ మ్యాచ్‌లను నిర్వహించారు.

జూలో ప్రత్యేక ఆకర్షణగా జిరాఫీల ఆకృతి


క్రోటన్ మొక్కలతో రూపొందించిన జిరాఫీల ఆకృతి

ఆరిలోవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో క్రోటన్ మొక్కలతో జిరాఫీల ఆకృతిని జూ పార్కులో సిబ్బంది తీర్చిదిద్దారు. ఇది ఆకర్షణీయంగా ఉంటూ సందర్శకులను ఆకట్టుకుంటోంది. పచ్చదనంతో కూడిన ఆ జిరాఫీల జంట చూసేందుకు అచ్చంగా నిజమైన జిరాఫీల్లా తలపిస్తున్నాయంటూ సందర్శకులు అంటున్నారు. ఈ జిరాఫీల ఆకృతి వద్ద సందర్శకులు ఎక్కువగా ఫోటోలు, సెల్ఫీలు దిగుతున్నారు. దీంతో సందడి నెలకొంటోంది. జూకు ఈ జిరాఫీల ఆకృతి ప్రత్యేక ఆకర్షణగా మారిందని పలువురు అంటున్నారు.

మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత మహిళల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రైల్వే వెయిట్ లిఫ్టింగ్ హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజర్ జసఫ్ కబీర్ అన్సారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధ్యానచంద్ అవార్డీ, వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష, రైల్వే వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తొలి పోటీల్లో: 45 కిలోల కేటగిరిలో జి.హిమ నాగమణి, సవిత సేనాపతి, యు.పద్మిని; 49 కిలోల విభాగంలో పి.నాగమణి, జి.నీలిమ, సిబాని పాణిగ్రహి; 55 కిలోల విభాగంలో ఎస్.పార్వతి, ఎం.వి.లక్ష్మి, జీరా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

రమాబాయి సంఘానికి దివీస్ ఆర్థిక సాయం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిటీ నగర్ రమాబాయి యువజన సేవా సంఘానికి దివీస్ యాజమాన్యం మంగళవారం 40 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ సంస్థ తరపున నిర్వాహ కులైన యువకులు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టడానికి వీలుగా ఈ ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించినట్టు సామాజిక సేవా విభాగం అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్‌ప్రతినిధులు నర్సింహ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల పక్కనే చెత్తాచెదారం

పరిసరాలన్నీ అపరిశుభ్రం


రోడ్డు పక్కనే పడి ఉన్న చెత్త

ఆరిలోవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11 వ వార్డులో గల గాంధీనగర్‌లో రోడ్డు పక్కనే కొందరు చెత్తాచెదరాలు వేస్తుండడంతో ఈ రోడ్డు, పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. ఈ ప్రాంతంలో కొంతమంది వేడుకలు నిర్వహించిన అనంతరం ఆ చెత్తాచెదారాలను అక్కడే పడేస్తున్నారు. వాటి తీసివేతకు ఎలాంటి చర్యలూ చేపట్టం లేదు. దీంతో పరిరాలన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. జీవీఎంసీ సిబ్బంది కూడా వీటిని తొలగించడం లేదు. అది తమ పని కాదంటూ సాకులు చెబుతున్నారు. దీంతో ఈ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంటున్నది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్తాచెదారాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద రోడ్డుపై భిక్షాటన చేసుకునే గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఇతనికి సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయసు ఉంటుంది. స్థానిక 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు, రవిబాబులు 'అవర్‌హ్యాండ్' అనే స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇవ్వడంతో ఆ సంస్థ అధ్యక్షుడు పిల్లి గోవిందరాజు మంగళవారం తమ బృందంతో అక్కడకు వచ్చారు. అనాథ మృతదేహానికి కాన్వెంటు శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపించారు.

రుషికొండ బీచ్‌లో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారులు


ఇసుక తిన్నెల్లో ఉత్సాహంగా క్రీడాకారులు

మధురవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ క్రీడాకారులు మంగళవారం రుషికొండ బీచ్‌ను సందర్శించారు. పది రాష్ట్రాలకు చెందిన వీరంతా ఈ నెల 6 నుంచి 18 వరకు ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో నిర్వహిస్తున్న వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారు. మహిళా పారా అథ్లెటిక్స్ ఒలింపిక్, అంతర్జాతీయ క్రీడాకారులున్నారు.

పూర్ణమిదం సంస్థ నిర్వాహకురాలు ఆర్కిటెక్ట్ కావ్య పూర్ణిమ బలజేపల్లి ఆధ్వర్యంలో బీచ్‌ను సందర్శించారు. తీరం అందాలు మంత్రముగ్ధులను చేశాయని, ఆహ్లాదకరమైన ప్రదేశాలు ఆనందంగా గొలిపాయన్నారు.

ఘనంగా పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు


పోలమాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఆరిలోవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో మంగళవారం పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు అత్యతం వైభవంగా జరిగాయి. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి .చినగదిలి నార్త్ షిర్డీ సాయి బాబా ఆలయం సమీపంలో గల పోలమాంబ అమ్మవారిఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే సంజయ్ గాంధీ కాలనీలోని పోలమాంబ అమ్మవారి ఆలయానికి భక్తులు ఉదయం నుంచి పోటెత్తారు. మాలధారణ చేసిన వారు రాత్రి అగ్నిగుండం తొక్కి మొక్కలు తీర్చుకున్నారు. అలాగే ఆరిలోవ ఆఖరి బస్టాపు వద్ద గల పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఆలయం ధర్మకర్త భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. సూర్యతేజనగర్‌లోని అమ్మవారి ఆలయం, పెదగదిలి జంక్షన్‌లో గల పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఆలయం ధర్మకర్త బుడుమూరు గోవింద్ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, పులహోరా పంపిణీ చేశారు. రామలక్ష్మణపురం నేతాజీ నగర్‌లో గల పోలమాంబ అమ్మవారి ఆలయంలో సాయంత్రం పరస జరిగింది. అన్ని ఆలయా వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆ పరిసరాలన్నీ సందడిగా మారాయి. ఆలయాలు రోజంతా భక్తులతో కిటకిట లాడాయి. ఆరిలోవ పోలీసులు బందోబస్తు నిర్వమించారు. అమ్మవారి పండుగ నేపథ్యంలో బంధువుల రాకతో ఇళ్లు కళకళలాడాయి.

సామాజిక విలువలను చాటి చెప్పిన నాటిక ప్రదర్శనలు


27వ మైలురాయి నాటికలోని ఓ రసవత్తర దృశ్యం

మద్దిలపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో పైడా కౌశిక్ నాటకోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా చేశాయని నాటక ప్రియులు కొనియాడారు.

తొలుత కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన '27వ మైలురాయి' నాటిక ఆకట్టుకుంది. లాయర్ రంగనాథం చేపట్టిన కేసు వల్ల నష్టపోయిన కుటుంబం లాయర్‌పైనే పగ బడతారు. బాధిత కుటుంబం లాయర్ రంగనాథం కుమార్తెను ఓ హత్యకేసులో ఇరికించి అరెస్టు చేయిస్తారు. ఇదంతా తాను వాదించిన కేసులో నష్టపోయిన వారు చేస్తున్నారని తెలుసుకుని మున్ముందు తప్పుడు కేసులు వాదించనని వాగ్దానం చేయడంతో నాటకం పూర్తయింది.

అమరావతి ఆర్ట్ ఆధ్వర్యంలో 'చిగురు మేఘం' నాటకం ఆద్యంతం ఆసక్తికరంగా సాగి ఆకట్టుకుంది. పేద రైతులు పొలం అమ్మి కొడుకుని డాక్టర్ చదివిస్తారు. కొడుకు మరో ధనవంతురాలైన వైద్యురాలిని పెళ్లిచేసుకుని తల్లిదండ్రులనే విస్మరిస్తాడు. చివరకు కొడుకు చేతిలో తల్లి మృతి చెందడంతో కనువిప్పు కలిగి భార్యను, ధనాన్ని వదిలి గ్రామానికి వచ్చి వైద్య సేవలు అందించడంతో నాటిక ముగుస్తుంది. ఈ రెండు నాటికలు సామాజిక బాధ్యతనుచాటి చెప్పాయని ప్రేక్షకులు, నాటక ప్రియులు పేర్కొన్నారు.

కేంద్ర కారాగారంలో వేలంపాట నిర్వహణ రద్దు

ఆరిలోవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) కేంద్ర కారాగారంలోని పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహిస్తామని ప్రకటించిన ఆవులు, మామిడి తోటల వేలం పాటను రద్దు చేసినట్టు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ వేలం ప్రక్రియ రద్దు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని వేలం పాటలో పాల్గొనదలచిన వారంతా గ్రహించాలని కోరారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. వేలంపాట మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో కారు వాషింగ్ షెడ్లు

- అక్రమార్కుల దందా
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న జీవీఎంసీ అధికారులు


ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కారు వాషింగ్ షెడ్డు

ఆరిలోవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13 వ వార్డులో గల శ్రీకాంత్‌నగర్ లే అవుట్‌లోని జీవీఎంసీ రోడ్డులో కొందరు షెడ్డులను నిర్మించి కారు వాషింగ్ కేంద్రాలుగా వాడుతున్నారు. ఇక్కడ సరైన పార్కింగ్ స్థలం కూడా లేదు. దీంతో పలువురు ఇక్కడకు వస్తున్న కారు యజమానులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానకులు వాపోతున్నారు. ఇదంతా బహిరంగంగా కనిపిస్తున్నా జీవీఎంసీ అధికారులు గాని, సచివాలయ సిబ్బంది గాని కిమ్మనడం లేదు. దీంతోఆక్రమణదారులకు అడ్డే లేకుండా పోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విధంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక మర్మమేమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఇలాంటి ఆక్రమణలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



కారు వాష్ షెడ్డు ముందు రోడ్డుపైనే పార్కింగ్ చేసిన కార్లు

ఎస్‌బీఐలో ఉచిత వైద్య శిబిరం


దంత పరీక్ష చేస్తున్న వైద్యులు

సీతంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వి హెల్త్ కేర్, వి డెంటల్ ఆసుపత్రులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బ్యాంక్ ఖాతాదారులకు, ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అధిక రక్తపోటు (బీపీ), చక్కెర వ్యాధి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎన్.దుర్గాప్రసాద్, డాక్టర్ వి.సర్వలత, వి హెల్త్ కేర్ డైరెక్టర్ కేఎంకే రమేష్, క్లినిక్ హెడ్ సీహెచ్ కృష్ణ, సిబ్బంది లతీష్, తులసి, లిఖిత సేవలందజేశారు.

విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్

మహారాణిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ క్వీన్‌మేరీస్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులకు వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు వి.జోగేంద్రనాథ్ తెలిపారు. ఐటీ ఐటీఈఎస్ విద్యార్థులకు భవిష్యత్‌లో చాలా అవసరమన్నారు. విశాఖ జీసీడీవో కాలేషా బేగం, జిల్లా కో-ఆర్డినేటర్ రుషి పర్యవేక్షిస్తారు. ఒకేషనల్ ట్రైనర్ సంధ్య విద్యార్థినులకు మార్గదర్శకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

కవి సమ్మేళనానికి ఆహ్వానం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో మే 8న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వహించే అంతర్జాతీయ కవి సమ్మేళనంలో కవితా గానం చేసేందుకు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎంవీ ధర్మారావుకు ఆహ్వానం అందింది. భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడే సాబ్ ఆయనకు ఆహ్వానం పంపారు. తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఉపాధ్యాయుడు ధర్మారావు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద రోడ్డుపై భిక్షాటన చేసుకునే గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఇతనికి సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయసు ఉంటుంది. స్థానిక 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు, రవిబాబులు 'అవర్‌హ్యాండ్' అనే స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇవ్వడంతో ఆ సంస్థ అధ్యక్షుడు పిల్లి గోవిందరాజు మంగళవారం తమ బృందంతో అక్కడకు వచ్చారు. అనాథ మృతదేహానికి కాన్వెంటు శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపించారు.

ఉక్కులో 'ప్రి మెచ్యూర్ రిటైర్‌మెంట్'

... 5వ పేజీ తరువాయి

న్యాయమని ప్రశ్నిస్తున్నారు. గతంలో రిటైర్‌మెంట్ వయస్సు 58 ఏళ్లుగా ఉండగా, ఉద్యోగుల అనుభవం అవసరమని నాటి ప్రధాని వాజపేయి రిటైర్‌మెంట్ వయసును 60 ఏళ్లకు పెంచారని, ఇప్పుడు వారికి జీతాలు ఇవ్వడం ఇబ్బందిగా ఉందని, ఏకంగా పదేళ్లు తగ్గించేసి 50 ఏళ్లకే ఇంటికి పంపడం దారుణమని విమర్శిస్తున్నారు. ఈ నిర్ణయాలను ఎవరైనా వ్యతిరేకిస్తే వారిని కూడా ఇంటికి పంపించేయాలని చూస్తున్నారని పలువురు వాపోతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె వాయిదా

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో సరిగా పనిచేయని వారిని, విధులకు హాజరుకాని వారిని మాత్రమే తొలగిస్తామని, ఆ స్థానంలో ఇప్పటికే తొలగించిన 1,503 మందిలో బాగా పనిచేసే వారిని తిరిగి తీసుకుంటామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును రెండు నెలల పాటు వాయిదా వేయాలని, ఈలోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని కార్మిక నాయకులు కోరగా...మే 20వ తేదీ వరకు ఎవరినీ తొలగించబోమని యాజమాన్యం హామీ ఇచ్చింది. దీంతో కార్మిక నిరవధిక సమ్మెను మే 20వ తేదీ వరకు వాయిదా వేస్తున్నామని కార్మిక సంఘ నాయకులు ప్రకటించారు. ఇదిలావుండగా మే 20వ తేదీలోపు మరోసారి ఆర్‌ఎల్‌సీ సమక్షంలో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్ల అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది. ఈ చర్చల్లో స్టీల్‌ప్లాంట్ అధికారులు గాంధీ, ఖర్, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మంత్రి రవి, నీరుకొండ రామచంద్రరావు, కె.వంశీకృష్ణ, సోంబాబు, శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.

దారిలో వాహనాలు నిలిపేస్తే ఎలా?

మురళీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాధవధార, బిర్లా జంక్షన్, ఊర్వశి హైవే ప్రాంతాల్లోని సర్వీసు రోడ్డు వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. గ్రేటర్ 51వ వార్డు అప్పయ్య నగర్ నివాసిత ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న హైవే నాలుగో లైను సర్వీసు రోడ్డుతో నాలుగు వరుసల రహదారి పూర్తవుతుంది. తిరిగి ఎయిర్‌పోర్ట్, షీలానగర్ దాటే వరకు ఎక్కడా సర్వీసు లైను కనిపించదు. ఇటు నగరంలోకి వెళ్లే దారిలోకి మళ్లే వాహనాలు ఒక్కసారిగా ఆర్‌అండ్‌బీ వద్దే సర్వీసు లైనులోకి మళ్లుతాయి. ఇలాంటి కీలక మార్గంలో ఆర్‌అండ్‌బీ మారియట్ హోటల్ నుంచి అప్పయ్యనగర్ నివాస లేఅవుట్‌లో శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట, బిర్లా జంక్షన్ డీమార్ట్, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం, ఊర్వశి, పాలిటెక్నిక్ కళాశాలల వరకు రోడ్డు ఖాళీ ఉండటం లేదు. ఈ ప్రాంతాల్లో ఇటీవల విస్తరించిన వాణిజ్య సముదాయాలతో పాటు ప్రధానంగా హోటళ్లు, డీమార్ట్ వ్యాపారం, పాస్‌పోర్టు కోసం హైవేపైనే వాహనాలు నిలిపేసి డివైడర్లపై వేచి ఉంటున్న అభ్యర్థులతో సర్వీసు లైన్ పార్కింగ్ ప్రాంతంగా తయారైంది. నగరంలోకి ప్రవేశించే దారి కనిపించడం లేదు. హైవే సెంటర్ లైన్‌లో ఆటోలు వెళ్లకూడదనే నిబంధన కారణంగా సర్వీసు లైనులో దూసుకొస్తున్న ఆటో వాలాలతో హైవే సర్వీసు రోడ్డు రోజంతా రద్దీగా ఉంటోంది. పార్కింగ్ చేసి ఉంటున్న బైకుల నుంచి వ్యాన్‌లు, లారీలు, ట్రావెల్ బస్సులతో చిక్కులు ఏర్పడుతున్నా కంచరపాలెం ట్రాఫిక్ విభాగం పోలీసులు స్పందించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. హైవే సర్వీసు లైనులో రాకపోకలు సాఫీగా సాగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


ఆర్‌అండ్‌బీ వేంకటేశ్వరస్వామి ఆలయ మార్గంలో నిలిపివేసిన వాహనాలు

వక్ఫ్ సవరణ చట్టం ఉపసంహరణకు డిమాండ్


సంఘీభావాన్ని ప్రకటిస్తున్న ముస్లింలు, మేధావులు, సీఐటీయూ నాయకులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, దీన్ని ఉపసంహరించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ విశాఖ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.అష్రఫ్ అధ్యక్షత వహించారు. ముస్లిం సంఘాలు, మసీద్ పెద్దలు మునీరు, అహ్మద్‌ఖాన్, అబిద్‌బేగం, ఎదీన్, మున్నీషా, సీపీఐఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్పొరేటర్ బి.గంగారావు, ఆర్కేఎస్వీ కుమార్ పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. సవరించిన చట్టంలో మార్పులు ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను చీల్చి తన హిందూత్వ అజెండాను ముందుకు తెస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులను నిర్ధారించే అధికారాన్ని సర్వే కమిషనర్ నుంచి ప్రభుత్వం నియమించిన రెవెన్యూ అధికారులకు బదిలీ చేయడం ద్వారా ఆరాధనా స్థలాలు, విద్యాసంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వృత్తివిద్యా కేంద్రాలను స్వాధీనం చేసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందన్నారు.

వైకుంఠగిరి ధర్మకర్తకు కేంబ్రిడ్జి డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న వైకుంఠగిరి ధర్మకర్త కర్రి సముద్రారెడ్డి

సీతమ్మధార, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాశీపట్నంలోని వైకుంఠగిరి అనంత వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించినందుకు సీతమ్మధార ప్రాంతానికి చెందిన ధర్మకర్త కర్రి సముద్రారెడ్డికి కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ ఆధ్యాత్మిక రంగంలో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సముద్రారెడ్డి మంగళవారం ఢిల్లీలో ఈ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాన హైకమిషనర్ లూయిస్ ఓబంగ్, పాలస్తీనా ఎంబసీ కౌన్సిలర్ బాసిమ్ ఎఫ్ హిల్సి, బాలీవుడ్ హీరో రాహుల్ రాయ్‌లు విచ్చేశారని సముద్రారెడ్డి తెలిపారు. సుమారు నాలుగు వేల అడుగుల ఎత్తున కొండపై వైకుంఠగిరి లాంటి పెద్ద క్షేత్రాన్ని నిర్మించడం భారత దేశంలో ఎన్నో ఆధ్యాత్మిక సంస్థలకు దారి చూపినట్లవుతుందని అతిథులు అన్నారు. చాలా క్లిష్టమైన అరణ్య ప్రాంతంలో కనీస సౌకర్యాలు కూడా లేని సుమారు 18 కిలోమీటర్ల ఘాటు రోడ్డులో నిర్మాణం చేపట్టడం చాలా సాహసోపేతమని అభివర్ణించారు. ఇంత మంచి ప్రజా ప్రయోజన కార్యక్రమం చేపట్టిన కర్రి సముద్రారెడ్డికి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందించడం అభినందనీయమన్నారు. గ్రూప్ ఉపాధ్యక్షులు యూఎస్ మల్లిక్, ఐఏఎస్‌లు, పలు యూనివర్సిటీల సీఈవోలు, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత మహిళల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రైల్వే వెయిట్ లిఫ్టింగ్ హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజర్ జసఫ్ కబీర్ అన్సారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధ్యానచంద్ అవార్డీ, వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష, రైల్వే వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తొలి పోటీల్లో: 45 కిలోల కేటగిరిలో జి.హిమ నాగమణి, సబిత సేనాపతి, యు.పద్మిని; 49 కిలోల విభాగంలో పి.నాగమణి, జి.నీలిమ, సిబాని పాణిగ్రాహి; 55 కిలోల విభాగంలో ఎన్.పార్వతి, ఎం.వి.లక్ష్మి, జీరా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

ఆహారంలో శుచి, రుచి ఉండేలా చర్య తీసుకోండి


కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీజీవీఎం సభ్యులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వ్యాపారులు శుచి, శుభ్రతతో కూడిన ఆహారాన్ని మాత్రమే అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు కేవీజీవీఎం సభ్యులు విజ్ఞప్తి చేశారు. కేవీజీవీఎం నగర ఇన్‌చార్జ్ కాండవ గాయత్రీ ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం కలెక్టర్‌ను కలిశారు. మంచి ఆహారాన్ని ప్రజలకు అందించాలని, ఆహార కల్తీ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో అభ్యర్థించారు. సభ్యులు దీప్తి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వర్‌ను కఠినంగా శిక్షించాలి

మహారాణిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పోతిన మల్లయ్యపాలెంలో నిండు గర్భిణి అనూషను అమానుషంగా హతమార్చిన ఆమె భర్త జ్ఞానేశ్వర్‌ను అత్యంత కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అత్తిలి విమల డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ హోంమంత్రి అనిత ఉంటున్న విశాఖ నగరంలోనే ఇంత దారుణమైన సంఘటన జరిగినప్పటికీ ఇంతవరకు ఆమె స్పందించకపోవటం దారుణమని అన్నారు. కూటమి పాలనలో జరుగుతున్న నేరాలు, మహిళలపై దాడులను కట్టడి చేసి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ నాయకులు కె.వనజాక్షి, ఎండీ బేగం తదితరులు పాల్గొన్నారు.


కేజీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా నాయకులు

విమానాశ్రయంపై చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

ఆపేశారు. దీనివల్ల వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాగే ఈ నెలాఖరు నుంచి అంతర్జాతీయ సర్వీసులు బ్యాంకాక్, మలేషియాలకు బుకింగ్స్ ఆపేశాయి. ఇక మిగిలింది సింగపూర్ విమానం ఒక్కటే. రాష్ట్రంలో విదేశీయులు ఎక్కువ మంది వచ్చే నగరం తిరుపతి. ఆ తరువాత విశాఖపట్నమే. అలాంటి నగరానికి అంతర్జాతీయ సర్వీసులు రద్దయిపోతున్నాయి. గతంలో ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ విమాన సంస్థలతో చర్చించి గోవా, భువనేశ్వర్, కోయంబత్తూర్, పుణే నగరాలకు విమాన సర్వీసులు వేయించింది. అవన్నీ నిలిచిపోయాయి. ఆకాశ్ ఎయిర్ ముంబై సర్వీస్ నిలిపివేసింది. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా వెలుగొందుతున్న విశాఖ నుంచి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఎయిర్ కనెక్టివిటీ అవసరం. ఈ విషయంలో ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవ తీసుకోవలసి ఉంది. కొత్త విమాన సర్వీసులు తెప్పించాల్సి ఉంది.

ఉడాన్ యాత్రీ కేఫ్‌ల అవసరం

కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయాల్లో ఆహార పదార్థాల ధరలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటి కారణంగా ప్రయాణికులు ఆకలితో ఉండకూడదని ఇటీవల 'ఉడాన్ యాత్రీ కేఫ్'లు ప్రారంభించింది. విమానాశ్రయంలో వీటిని ఏర్పాటు చేసి టీ, కాఫీ, టిఫిన్ ఏదైనా 20 రూపాయలకే ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ఇటువంటి క్యాంటీన్‌ను ఇటీవలె చెన్నై విమానాశ్రయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. విశాఖ విమానాశ్రయంలో రెండు ఇడ్లీ రూ.180కి విక్రయిస్తున్నారు. టీ లేదా కాఫీ తాగితే రూ.100 చెల్లించాలి. ఈ విమానాశ్రయం నుంచి రోజుకు సగటున నాలుగు వేల మంది ప్రయాణిస్తున్నారు. ఇక్కడ కూడా ఆ క్యాంటీన్ అవసరం ఉంది. కానీ మంత్రి ఆ దిశగా ఎటువంటి ప్రయత్నం చేయలేదు.

ఆర్థిక శాఖ మంత్రి చెప్పినా చర్యలు లేవు

విమానాశ్రయాల నుంచి సరకు రవాణా పెంచాలని, వాటిని ప్రోత్సహిస్తామని కొత్త బడ్జెట్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇటీవల ఆమె విశాఖ వచ్చినప్పుడు అపాటా ప్రతినిధులు విశాఖలో మల్టీ టెంపరేచర్ కోల్డ్ స్టోరేజీ సౌకర్యంతో కార్గో గోడౌన్ ఏర్పాటు చేయాలని కోరారు. దానికి ఆమె స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ పంపితే పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. దానిని కూడా కేంద్ర మంత్రి పట్టించుకోలేదు. రాష్ట్రానికి ఆర్థిక రాజధాని అని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం కూడా విశాఖ విమానాశ్రయంపై దృష్టిసారించాల్సి ఉంది.

కేంద్ర మంత్రితోనే సాధ్యం

విశాఖ విమానాశ్రయం సమస్యలు పరిష్కరించే సత్తా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు మాత్రమే ఉందని అపాటా ప్రతినిధులు నరేశ్‌కుమార్, కుమార్ రాజా, డీఎస్ వర్మ పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆయనకు ఓ లేఖ రాశారు. రద్దయిన సర్వీసులు పునరుద్ధరించాలని కోరారు.

ఆసక్తికరంగా రైల్వే ఫుట్‌బాల్ టోర్నీ


ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఫుట్‌బాల్ విజేత క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత ఫుట్‌బాల్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. ఫుట్‌బాల్ అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న టోర్నీలో భాగంగా మంగళవారం తొలి మ్యాచ్‌లో ఆపరేటింగ్ 2-0 గోల్స్‌తో సిగ్నల్ అండ్ టెలికాంపై, రెండో మ్యాచ్‌లో డీజిల్ లోకోషెడ్ 1-0 గోల్‌తో పర్సనల్ శాఖపై విజయం సాధించాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగిన చివరి మ్యాచ్‌లో టీఆర్‌డీ 1-0 గోల్ తేడాతో కమర్షియల్ శాఖపై గెలుపొందింది. ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాసరావు, గణేష్, తిరుమలరావులు ఈ మ్యాచ్‌లను నిర్వహించారు.

కిరాతకం

... 5వ పేజీ తరువాయి

కుటుంబ సభ్యులు అంగీకరించారు. కానీ, జ్ఞానేశ్వర్ మాత్రం తమ కుటుంబ సభ్యుల అంగీకరించరని, పెళ్లి తరువాత చెబుదామని అనూషను ఒప్పించాడు. 2022 డిసెంబరు పదో తేదీన సింహాచలంలో అనూష కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వివాహమైన తరువాత ఎనిమిది నెలలపాటు ఇద్దరూ బాగానే ఉన్నారు. ఆ తరువాత నుంచి జ్ఞానేశ్వర్ అసలు రంగు బయటపడుతూ వచ్చింది. పెళ్లి జరిగిన సుమారు ఏడాదికి తనకు బ్లడ్ కేన్సర్ ఉందని అనూషకు చెప్పాడు. తాను ఎక్కువ కాలం జీవించనని, తనను విడిచి వెళ్లిపోవాలని, నీ జీవితం నాశనం కాకూడదని అన్నాడు. అలా వదిలి వెళ్లబోనని, ఉన్నంత కాలం నీతోనే ఉంటానంటూ అనూష చెప్పినా...అతడు తన ప్రయత్నాలను ఆపలేదు. రక్తపు వాంతులు చేసుకున్నట్టు, తీవ్రమైన నీరసంతో బాధపడుతున్నట్టు నమ్మించే ప్రయత్నం చేశాడు. వైద్యం కోసమంటూ అనూష వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నాడు. ఆ తరువాత అనారోగ్య సమస్యను పక్కనపెట్టి తన కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని, నిన్ను చంపేస్తారంటూ అనూషను భయపెట్టడం మొదలుపెట్టాడు. ఇప్పటికైనా నీదారి నువ్వు చూసుకోవాలంటూ అనూషను వదిలించుకునే ప్రయత్నం చేశాడు. కానీ, అనూష 'నాకు సర్వం నువ్వే. ప్రాణాలు పోయినా నిన్ను వదిలి వెళ్లను' అని చెప్పింది. ఈ క్రమంలోనే అనూష గర్భం దాల్చింది. కొద్దిరోజులు అనూషను బాగానే చూసుకున్నట్టు నటించాడు. నాలుగు రోజుల కిందట ఫలూదా తీసుకువచ్చి అనూషకు ఇచ్చాడు. తాగే క్రమంలో ఒక టాబ్లెట్ బయటకు రావడంతో ఒక్కసారిగా అనూష షాక్ తింది. టాబ్లెట్ ఉన్న విషయాన్ని జ్ఞానేశ్వర్‌కు చెప్పి షాపునకు వెళ్లి నిలదీద్దామన్నది. దానికి సరేనన్న జ్ఞానేశ్వర్ టాబ్లెట్ పక్కన పెట్టాలని సూచించి బయటకు వెళ్లిపోయాడు. ఇదే విషయాన్ని అనూష కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా చెప్పింది. అప్పుడు కూడా జ్ఞానేశ్వర్‌పై అనుమానం రాలేదు. ప్రసవానికి సమయం దగ్గరపడడంతో ఆదివారం సాయంత్రం డాక్టర్ వద్దకు వెళ్లారు. ఆస్పత్రిలో చేరాలని వైద్యురాలు సూచించారు. అయితే, ఆదివారం ఎందుకు, సోమవారం చేరుదామని చెప్పి అనూషను ఇంటికి తీసుకువెళ్లాడు. అదేరోజు ఉదయం అనూష అమ్మమ్మ తుమ్మలపల్లి అన్నవరం కాకినాడ నుంచి వచ్చారు. రాత్రి ఆస్పత్రి నుంచి వచ్చిన ఇద్దరికీ అన్నం పెట్టింది. ఇద్దరూ రూమ్‌లోకి వెళ్లారు. అనూష అమ్మమ్మ హాల్‌లో పడుకుంది. సోమవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో వాళ్లున్న గదిలోకి అనూష అమ్మమ్మ వెళ్లింది. అప్పటికీ నిద్రలో ఉన్నట్టు కనిపించిన అనూషను తట్టి లేపే ప్రయత్నం చేసింది. ఎంతసేపటికీ లేవకపోవడంతో పక్కనే కుర్చీలో కూర్చుని సెల్‌ఫోన్ చూసుకుంటున్న జ్ఞానేశ్వర్‌తో అమ్మాయి లేవడం లేదు...చూడాలని చెప్పింది. ఏమీ తెలియనట్టు చెంపలపై కొడుతూ లే అనూష..అంటూ నాటకాలాడే ప్రయత్నం చేశాడు. అనూష లేవడం లేదని, ఏమైందో తెలియడం లేదంటూ అనూష అమ్మమ్మకు చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె ఎదురింటి వాళ్లను పిలిచింది. అనూష స్నేహితులకు జ్ఞానేశ్వర్ విషయాన్ని తెలియజేయడంతో వారంతా ఇంటికి చేరుకున్నారు. తొలుత దగ్గరలోని రెండు ఆస్పత్రులకు కారులో తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో కేర్‌కు తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు చనిపోయిందని నిర్ధారించారు. అనూష తనను విడిచి వెళ్లిపోయిందని, తాను ఎలా బతకాలంటూ జ్ఞానేశ్వర్ నాటకాన్ని రక్తికట్టించే ప్రయత్నం చేశాడు.

గాయాలతో అనుమానం

కేర్ నుంచి అనూషను ఇంటికి తీసుకువెళ్లిపోయేందుకు జ్ఞానేశ్వర్ ప్రయత్నించాడు. అయితే, జ్ఞానేశ్వర్ ముఖం, చేతిపై గాయాలు ఉండడాన్ని గుర్తించిన అనూష స్నేహితుడు ఆదర్శ్‌కు అనుమానం వచ్చింది. తన తల్లిని కేర్ ఆస్పత్రికి రమ్మని చెప్పాడు. ఆమె కేజీహెచ్‌లో పనిచేస్తున్నారు. మెడపై కొన్ని మచ్చలు ఉండడం, శరీరం పూర్తిగా నల్లగా మారిపోవడంతో కేజీహెచ్‌కు తీసుకువెళదామని ఆమె చెప్పారు. దానికి జ్ఞానేశ్వర్ వద్దంటూ వారించే ప్రయత్నం చేశాడు. కానీ, అంతా తీసుకువెళ్లాల్సిందేనని పట్టుబట్టడంతో వారితోపాటు అంబులెన్స్‌లో ఎక్కి కేజీహెచ్‌కు వెళ్లాడు. అక్కడి వైద్యులు కూడా చనిపోయిందని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులు గట్టిగా అడగడంతో తొలుత తానే చంపేశానని చెప్పాడు. ఆ తరువాత ఉరి వేసుకుందని చెప్పాడు. మళ్లీ గట్టిగా అడగడంతో తనకు ఇష్టం లేదని అందుకు చంపేసినట్టు అంగీకరించాడు. అమ్మాయికి పెళ్లి జరిగినప్పుడు తనకు ఆరోగ్యం బాలేదని, కోమాలో ఉన్నానని, ఇప్పుడు తన బిడ్డను పూర్తిగా దూరం చేశాడని ఆమె తల్లి పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. తన బిడ్డకు ప్రసవం సమయంలో తోడుగా ఉండాలని వచ్చానని, తాను ఇంట్లో ఉండగానే బిడ్డ ప్రాణాలు తీసేశాడని అనూష అమ్మమ్మ అన్నవరం విలపించారు.

అంత్యక్రియలు పూర్తి..

అనూష కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చారు. వారి డిమాండ్ మేరకు అనూషను వారి స్వగ్రామమైన దువ్వాడ తీసుకువెళ్లి వారి కోడలిగా అంత్యక్రియలను నిర్వహించారు. పోయిన ప్రాణాన్ని తాము తీసుకురాలేకపోయినా వారి ఇంటి కోడలిగా గుర్తింపు తెచ్చుకోవాలని భావించిన అనూషకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించడం ద్వారా ఆత్మశాంతి కలిగించే ప్రయత్నం చేశామని అనూష మరిది స్వరూప్ తెలిపారు. ఇకపోతే, అనూష గర్భంలో ఆడ బిడ్డ ఉన్నట్టు పోస్టుమార్టం సమయంలో తేలింది.

గ్రేటర్‌లో మారుతున్న సమీకరణాలు

... 5వ పేజీ తరువాయి

అప్పటికి 72 మంది సభ్యులు మాత్రమే ఉండడంతో సంఖ్యా బలం పెంచుకోవడంపై నేతలు దృష్టిపెట్టారు. ఈలోగా తమ కార్పొరేటర్లను చేజారకుండా కాపాడుకునేందుకు కొద్దిరోజుల కిందట మలేషియా తరలించారు. వైసీపీకి చెందిన మరో ఇద్దరు కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు సాగించగా, సోమవారం నాటికి ముగ్గురిని కూటమిలోకి చేర్చుకోగలిగారు. దీంతో మేజిక్ ఫిగర్ కంటే ఒకరు అదనంగా ఉండడంతో ఈనెల 19 అవిశ్వాస తీర్మానం నెగ్గడం ఖాయమని కూటమి నేతలు ఊపిరిపీల్చుకున్నారు.

ఆందోళనకు గురిచేస్తున్న అసంతృప్తులు

అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా చేసేందుకు వైసీపీ నేతలు తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. టీడీపీ, జనసేన కార్పొరేటర్లతోపాటు ఇటీవల ఆయా పార్టీల్లో చేరిన వైసీపీ కార్పొరేటర్లలో అసంతృప్తితో ఉన్నవారిని గుర్తించే పనిలోపడ్డారు. గాజువాక ప్రాంతానికి చెందిన టీడీపీ కార్పొరేటర్ కొద్దిరోజులుగా వాట్సాప్‌లో టీడీపీ నేతలకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఆయనతో వైసీపీ నేతలు సంప్రతింపులు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇటీవల జనసేనలో చేరిన మహిళా కార్పొరేటర్ భర్త కూటమి నేతలపై అసంతృప్త గళం విప్పుతున్నట్టు సమాచారం. దీంతో ఆయన్ను కూడా వైసీపీ నేతలు కలిసినట్టు సమాచారం. ఇలాంటి ప్రచారం నేపథ్యంలో ఇప్పుడిప్పుడు ఊపిరిపీల్చుకుంటున్న కూటమి నేతల్లో ఆందోళన మొదలైందంటున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సేవలపై ఆరా

... 5వ పేజీ తరువాయి

ఎలా ఉంటుంది?, మీకు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా?, అవినీతి ఉందా?, పరిశుభ్రత ఎలా ఉందన్న..ప్రశ్నలు వేసి సమాధానాలను రాబడుతున్నారు.

కొన్నింటిపై ప్రజల్లో అసంతృప్తి

ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా? అనే ప్రశ్నకు జనవరిలో 66 శాతం మంది ప్రజలు అవును అని సమాధానం చెప్పగా, 34 శాతం మంది ఉండడం లేదన్నారు. ఫిబ్రవరిలో 79.44 మంది ఉంటున్నారని, 20.56 శాతం మంది ఉండడం లేదని, మార్చిలో 72.4 శాతం మంది అందుబాటులో ఉన్నారని చెప్పగా, 27.6 శాతం మంది ఉండడం లేదని, ఏప్రిల్‌లో 10వ తేదీ వరకు 74 శాతం మంది ఉంటున్నారని చెప్పగా, 26 శాతం మంది ఉండడం లేదని స్పష్టం చేశారు. డాక్టర్ ప్రవర్తన ఎలా ఉందన్న ప్రశ్నకు...జనవరిలో 65.39 శాతం మంది బాగుందని సమాధానం చెప్పగా, 34.01 శాతం సరిగా లేదన్నారు. ఫిబ్రవరిలో 68 శాతం మంది బాగుందని, 32 శాతం మంది బాగాలేదని, మార్చిలో 72 శాతం మంది బాగుందని, 28 శాతం మంది బాగాలేదని చెప్పారు. ఏప్రిల్‌లో 71 శాతం మంది బాగుందని, 29 శాతం మంది బాగాలేదన్నారు. సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందన్న ప్రశ్నకు జనవరిలో 63.91 శాతం మంది బాగుందని చెప్పగా, 36.09 శాతం బాలేదని సమాధానమిచ్చారు. ఫిబ్రవరిలో 64.36 శాతం మంది బాగుందని, 35.64 శాతం మంది బాగాలేదని, మార్చిలో 62.28 శాతం మంది బాగుందనగా, 37.72 శాతం మంది బాలేదని, ఏప్రిల్‌లో 64 శాతం మంది బాగుందని చెబితే...36 శాతం మంది బాగుండడం లేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా? అన్న ప్రశ్నకు జనవరిలో 57 శాతం మంది ఇచ్చారని చెప్పగా, 43 శాతం మంది ఇవ్వలేదన్నారు. ఫిబ్రవరిలో 61.77 శాతం మంది ఇచ్చారని, 38.23 శాతం మంది ఇవ్వలేదన్నారు. మార్చిలో 60.85 శాతం మంది ఇచ్చారని, 39.15 శాతం మంది ఇవ్వలేదని, ఏప్రిల్‌లో 68 శాతం మంది ఇచ్చారంటే, 32 శాతం మంది ఇవ్వలేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఏదైనా అవినీతిని గమనించారా?...అన్న ప్రశ్నకు జనవరిలో 63 శాతం మంది ఉందని చెప్పగా, 37 శాతం మంది లేదన్నారు. ఫిబ్రవరిలో 60 శాతం మంది అవినీతి ఉందంటే, 40 శాతం మంది లేదని, మార్చిలో 49 శాతం మంది ఉందని, 51 శాతం మంది లేదని, మార్చిలో 41 శాతం మంది ఉందని చెప్పగా, 59 శాతం మంది లేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశుభ్రత ఎలా ఉందన్న ప్రశ్నకు జనవరిలో 60 శాతం బాగుందని చెప్పగా, 40 శాతం మంది బాగాలేదని, ఫిబ్రవరిలో 46 శాతం మంది బాగుందని, 54 శాతం మంది బాగాలేదని, మార్చిలో 43 శాతం మంది బాగుందని, 57 శాతం మంది బాగాలేదని, ఏప్రిల్‌లో 49 శాతం మంది బాగుందంటే, 51 శాతం మంది బాగుండడం లేదని చెప్పారు.

ఇదీ యాక్షన్..

ఆయా ప్రశ్నలకు వచ్చిన సమాధానాలను బట్టి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆస్పత్రి అధికారులు ఎప్పటికప్పుడు సేవలు అందుతున్న తీరును పరిశీలించాలని ఆదేశించింది. విజిలెన్స్ తనిఖీలు నిర్వహించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. డ్యూటీలకు హాజరుకాని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చారు. ఉత్తమ పనితీరు కనబరిచే వైద్యులు, స్టాఫ్ నర్సులకు అవార్డులు ఇవ్వాలని సూచించింది. మందులు సరఫరా తగినంత ఉండేలా సెంట్రల్ మెడిసిన్ మానిటరింగ్‌సెల్ ఏర్పాటుచేసుకోవాలని ఆస్పత్రులకు సూచించారు. అవినీతి నిర్మూలనకు విజిలెన్స్ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఆస్పత్రుల్లో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటుచేయాలని, ఎక్కడికక్కడ పోస్టర్స్ ఏర్పాటుచేయాలని ఆస్పత్రి అధికారులకు ఉన్నతాధికారులకు సూచించారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు జీడీఏ, ఈసీయూ, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడి స్కిల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7995013421 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫుట్‌బాల్ టోర్నీకి యశ్వంత్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ అండర్-20 ఫుట్‌బాల్ టోర్నీకి నగరానికి చెందిన యశ్వంత్ ఎంపికయ్యాడు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగే ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు యశ్వంత్ ప్రాతినిధ్యం వహిస్తాడు. స్ట్రైకర్‌గా చోటు దక్కించుకున్న యశ్వంత్.. రాష్ట్రానికి పతకం సాధించాలని ఆకాంక్షించారు. జట్టు సభ్యులు: విఘ్నేశ్వర్, సాయి శ్రీనివాస్, అర్జున్, శ్రీనివాసుబాబు, మాచెల్, రాజేష్, సేతుమాధవ్, హర్ష, సురేంద్ర బాబు, భరత్‌కుమార్, లక్ష్మీ నరసింహ స్వామి, సయ్యద్ ఖజాఫీర్, రాఘవేంద్ర, యశ్వంత్, రాజేష్, సాహిల్ హుస్సేన్, జ్ఞానదీప్‌లు ప్రాతినిధ్యం వహిస్తారు.



పైపు లైన్ స్ట్రక్చర్ తగిలి పైకి లేచిన డంపర్ ముందు భాగం

స్టీల్‌ప్లాంటులో తప్పిన ప్రమాదం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ విభాగం సమీపంలోని పైపు లైపు లైన్ స్ట్రక్చర్‌ను ఓ డంపర్ ఢీకొంది. ఇందుకు సంబంధించి ఉద్యోగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్ ఫీల్డ్ మిషనరీ విభాగం (ఎఫ్ఎండీ) విభాగానికి చెందిన డంపర్ మెటీరియల్‌ను కోక్-ఓవెన్ విభాగం సమీపంలోని అన్‌లోడ్ చేసి బాడీని కిందకు దించకుండా బయలుదేరింది. ఈ క్రమంలో కోక్ ఓవెన్ విభాగం సమీపంలోని పైపు లైన్ స్ట్రక్చర్‌ను ఢీకొంది. అయితే పైపు లైన్‌కు ఎటువంటి డ్యామేజీ జరగలేదు. దీంతో ఉద్యోగులు అక్కడకు చేరుకుని డంపర్ వెనక భాగాన్ని కిందకు దించారు. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సినిమా గైడ్

- గుడ్, బ్యాడ్, అగ్లీ : శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- జాక్ : జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- రాబిన్‌హుడ్ : శ్రీలీలామహల్, గోకుల్,
- మ్యాడ్ : జగదాంబ, శరత్, కన్య (గాజువాక)
- పెళ్ళికాని ప్రసాద్ :శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), వకౌర్య (గోపాలపట్నం), తాతా(తగరపువలస)

కోర్ట్ : జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు)18, బెండకాయలు 28, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 18, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

జూ పార్కులో విరిగిన బెంచీలు

- సందర్శకులు బడలిక తీర్చుకునేందుకు అవకాశం లేని పరిస్థితి
- నాసిరకం మెటీరియల్ వాడారంటూ విమర్శలు
- రూ.లక్షలాది వృథా అంటూ ఆరోపణలు



జూ పార్కులో బెంచీ విరిగిపోగా కిందిభాగంలో రాళ్లు పెట్టి అమర్చిన దృశ్యం

ఆరిలోవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో సందర్శకులు కూర్చోడానికి అవసరమైన బెంచీలు కరవయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన బెంచీలు విరిగిపోయాయి. దీంతో జూ తిరిగి బడలిక తీర్చుకుందామంటే అవకాశమే లేకుండా పోతోందని సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఏర్పాటు చేసిన బెంచీలు విరిగిపోయాయని, నాసిరకం మెటీరియల్ వాడడమే ఇందుకు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సిమెంటు బెంచీలు విరిగిపోగా, జూ సిబ్బంది వాటి కింద రాళ్లు అమర్చారు. జూ పార్కులో ఈ పరిస్థితిని చూసిన సందర్శకులు నవ్వుకుంటున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సామగ్రి, బెంచీల విషయంలో జూ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి జూ లో నాణ్యత కలిగిన బెంచీలు ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

కరకచెట్టు పోలమాంబను దర్శించుకున్న ప్రముఖులు

- ప్రణవ్‌గోపాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ



తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు. పాల్గొన్న ఎమ్మెల్యే తనయుడు ప్రతాప్‌రుద్ర

సిరిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) :శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయం సమీపంలో మంగళవారం ఉచిత ప్రసాత వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ , టీడీపీ యువ నాయకుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర ప్రారంభించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు చక్ర పొంగలి, పులిహోర ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు వినయ్, రతన్‌కాంత్, విజయ్‌కుమార్, హరీష్‌కుమార్, అభిప్రదీప్, సంతోష్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూర్పు నియోజక వర్గం శాసనసభ్యుడు వెలగ పూడిరామకృష్ణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే తనయుడు ప్రతాప్ రుద్ర తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉచిత ప్రాదం పంపిణీ చేశారు.



అమ్మవారిని దర్శించకుంటున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ దంపతులు

జూలో ప్రత్యేక ఆకర్షణగా జిరాఫీల ఆకృతి



క్రోటన్ మొక్కలతో రూపొందించిన జిరాఫీల ఆకృతి

ఆరిలోవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో క్రోటన్ మొక్కలతో జిరాఫీల ఆకృతిని జూ పార్కులో సిబ్బంది తీర్చిదిద్దారు. ఇది ఆకర్షణీయంగా ఉంటూ సందర్శకులను ఆకట్టుకుంటోంది. పచ్చదనంతో కూడిన ఆ జిరాఫీల జంట చూసేందుకు అచ్చంగా నిజమైన జిరాఫీల్లా తలపిస్తున్నాయంటూ సందర్శకులు అంటున్నారు. ఈ జిరాఫీల ఆకృతి వద్ద సందర్శకులు ఎక్కువగా ఫోటోలు, సెల్ఫీలు దిగుతున్నారు. దీంతో సందడి నెలకొంటోంది. జూకు ఈ జిరాఫీల ఆకృతి ప్రత్యేక ఆకర్షణగా మారిందని పలువురు అంటున్నారు.

రోడ్ల పక్కనే చెత్తాచెదారం

పరిసరాలన్నీ అపరిశుభ్రం



రోడ్డు పక్కనే పడి ఉన్న చెత్త

ఆరిలోవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11 వ వార్డులో గల గాంధీనగర్‌లో రోడ్డు పక్కనే కొందరు చెత్తాచెదరాలు వేస్తుండడంతో ఈ రోడ్డు, పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. ఈ ప్రాంతంలో కొంతమంది వేడుకలు నిర్వహించిన అనంతరం ఆ చెత్తాచెదారాలను అక్కడే పడేస్తున్నారు. వాటి తీసివేతకు ఎలాంటి చర్యలూ చేపట్టం లేదు. దీంతో పరిరాలన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. జీవీఎంసీ సిబ్బంది కూడా వీటిని తొలగించడం లేదు. అది తమ పని కాదంటూ సాకులు చెబుతున్నారు. దీంతో ఈ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంటున్నది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్తాచెదారాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రుషికొండ బీచ్‌లో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారులు



ఇసుక తిన్నెల్లో ఉత్సాహంగా క్రీడాకారులు

మధురవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ క్రీడాకారులు మంగళవారం రుషికొండ బీచ్‌ను సందర్శించారు. పది రాష్ట్రాలకు చెందిన వీరంతా ఈ నెల 6 నుంచి 18 వరకు ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో నిర్వహిస్తున్న వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారు. మహిళా పారా అథ్లెటిక్స్, ఒలింపిక్, అంతర్జాతీయ క్రీడాకారులున్నారు.

పూర్ణమిదం సంస్థ నిర్వాహకురాలు ఆర్కిటెక్ట్ కావ్య పూర్ణిమ బలజేపల్లి ఆధ్వర్యంలో బీచ్‌ను సందర్శించారు. తీరం అందాలు మంత్రముగ్ధులను చేశాయని, ఆహ్లాదకరమైన ప్రదేశాలు ఆనందంగా గొలిపాయన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మద్దిలపాలెం బస్టాండ్ వద్ద సత్యసాయి సేవా సమితి ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి సేవా సమితి, సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం మద్దిలపాలెం ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభించారు. సత్యసాయిబాబా నూరవ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, సత్యసాయి సేవా సమితి విశాఖ సిటీ కన్వీనర్ డీవీవీఎస్ రాజు ప్రారంభించారు. రెండు నెలల పాటుఈ చలివేంద్రం నిర్వహిస్తామని, గడచిన ముప్పై ఏళ్లగా ఇలాంటి సేవాకార్యక్రమాలనుచేస్తున్నామని తెలిపారు.

ఆసక్తికరంగా రైల్వే ఫుట్‌బాల్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత ఫుట్‌బాల్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. ఫుట్‌బాల్ అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న టోర్నీలో భాగంగా మంగళవారం తొలి మ్యాచ్‌లో ఆపరేటింగ్ 2-0 గోల్స్‌తో సిగ్నల్ అండ్ టెలికాంపై, రెండో మ్యాచ్‌లో డీజిల్ లోకోషెడ్ 1-0 గోల్‌తో పర్సనల్ శాఖపై విజయం సాధించాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగిన చివరి మ్యాచ్‌లో టీఆర్‌డీ 1-0 గోల్ తేడాతో కమర్షియల్ శాఖపై గెలుపొందింది. ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాసరావు, గణేష్, తిరుమలరావులు ఈ మ్యాచ్‌లను నిర్వహించారు.

మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత మహిళల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రైల్వే వెయిట్ లిఫ్టింగ్ హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజర్ జసఫ్ కబీర్ అన్సారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధ్యానచంద్ అవార్డీ, వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష, రైల్వే వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తొలి పోటీల్లో; 45 కిలోల కేటగిరిలో జి.హిమ నాగమణి, సబిత సేనాపతి, యు.పద్మిని; 49 కిలోల విభాగంలో పి.నాగమణి, జి.నీలిమ, సిబాని పాణిగ్రహి; 55 కిలోల విభాగంలో ఎన్.పార్వతి, ఎం.వి.లక్ష్మి, జీరా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

రమాబాయి సంఘానికి దివీస్ ఆర్థిక సాయం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిటీ నగర్ రమాబాయి యువజన సేవా సంఘానికి దివీస్ యాజమాన్యం మంగళవారం 40 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ సంస్థ తరపున నిర్వాహ కులైన యువకులు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టడానికి వీలుగా ఈ ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించినట్టు సామాజిక సేవా విభాగం అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్‌ప్రతినిదులు నర్సింహ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద రోడ్డుపై భిక్షాటన చేసుకునే గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఇతనికి సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయసు ఉంటుంది. స్థానిక 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు, రవిబాబులు 'అవర్‌హ్యాండ్' అనే స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇవ్వడంతో ఆ సంస్థ అధ్యక్షుడు పిల్లి గోవిందరాజు మంగళవారం తమ బృందంతో అక్కడకు వచ్చారు. అనాథ మృతదేహానికి కాన్వెంటు శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపించారు.

ఘనంగా పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు



పోలమాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఆరిలోవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో మంగళవారం పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు అత్యంతం వైభవంగా జరిగాయి. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి .చినగదిలి నార్త్ షిర్డీ సాయి బాబా ఆలయం సమీపంలో గల పోలమాంబ అమ్మవారిఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే సంజయ్ గాంధీ కాలనీలోని పోలమాంబ అమ్మవారి ఆలయానికి భక్తులు ఉదయం నుంచి పోటెత్తారు. మాలధారణ చేసిన వారు రాత్రి అగ్నిగుండం తొక్కి మొక్కలు తీర్చుకున్నారు. అలాగే ఆరిలోవ ఆఖరి బస్టాపు వద్ద గల పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఆలయం ధర్మకర్త భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. సూర్యతేజనగర్‌లోని అమ్మవారి ఆలయం, పెదగదిలి జంక్షన్‌లో గల పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఆలయం ధర్మకర్త బుడుమూరు గోవింద్ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, పులహోరా పంపిణీ చేశారు. రామలక్ష్మణపురం నేతాజీ నగర్‌లో గల పోలమాంబ అమ్మవారి ఆలయంలో సాయంత్రం పరస జరిగింది. అన్ని ఆలయా వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆ పరిసరాలన్నీ సందడిగా మారాయి. ఆలయాలు రోజంతా భక్తులతో కిటకిట లాడాయి. ఆరిలోవ పోలీసులు బందోబస్తు నిర్వమించారు. అమ్మవారి పండుగ నేపథ్యంలో బంధువుల రాకతో ఇళ్లు కళకళలాడాయి.

సామాజిక విలువలను చాటి చెప్పిన నాటిక ప్రదర్శనలు



27వ మైలురాయి నాటికలోని ఓ రసవత్తర దృశ్యం

మద్దిలపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో పైడా కౌశిక్ నాటకోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా చేశాయని నాటక ప్రియులు కొనియాడారు.

తొలుత కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన '27వ మైలురాయి' నాటిక ఆకట్టుకుంది. లాయర్ రంగనాథం చేపట్టిన కేసు వల్ల నష్టపోయిన కుటుంబం లాయర్‌పైనే పగ బడతారు. బాధిత కుటుంబం లాయర్ రంగనాథం కుమార్తెను ఓ హత్యకేసులో ఇరికించి అరెస్టు చేయిస్తారు. ఇదంతా తాను వాదించిన కేసులో నష్టపోయిన వారు చేస్తున్నారని తెలుసుకుని మున్ముందు తప్పుడు కేసులు వాదించనని వాగ్దానం చేయడంతో నాటకం పూర్తయింది.

అమరావతి ఆర్ట్ ఆధ్వర్యంలో 'చిగురు మేఘం' నాటకం ఆద్యంతం ఆసక్తికరంగా సాగి ఆకట్టుకుంది. పేద రైతులు పొలం అమ్మి కొడుకుని డాక్టర్ చదివిస్తారు. కొడుకు మరో ధనవంతురాలైన వైద్యురాలిని పెళ్లిచేసుకుని తల్లిదండ్రులనే విస్మరిస్తాడు. చివరకు కొడుకు చేతిలో తల్లి మృతి చెందడంతో కనువిప్పు కలిగి భార్యను, ధనాన్ని వదిలి గ్రామానికి వచ్చి వైద్య సేవలు అందించడంతో నాటిక ముగుస్తుంది. ఈ రెండు నాటికలు సామాజిక బాధ్యతనుచాటి చెప్పాయని ప్రేక్షకులు, నాటక ప్రియులు పేర్కొన్నారు.

కేంద్ర కారాగారంలో వేలంపాట నిర్వహణ రద్దు

ఆరిలోవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) కేంద్ర కారాగారంలోని పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహిస్తామని ప్రకటించిన ఆవులు, మామిడి తోటల వేలం పాటను రద్దు చేసినట్టు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ వేలం ప్రక్రియ రద్దు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని వేలం పాటలో పాల్గొనదలచిన వారంతా గ్రహించాలని కోరారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. వేలంపాట మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో కారు వాషింగ్ షెడ్లు

- అక్రమార్కుల దందా
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న జీవీఎంసీ అధికారులు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కారు వాషింగ్ షెడ్డు

ఆరిలోవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13 వ వార్డులో గల శ్రీకాంత్‌నగర్ లేఅవుట్‌లోని జీవీఎంసీ రోడ్డులో కొందరు షెడ్డులను నిర్మించి కారు వాషింగ్ కేంద్రాలుగా వాడుతున్నారు. ఇక్కడ సరైన పార్కింగ్ స్థలం కూడా లేదు. దీంతో పలువురు ఇక్కడకు వస్తున్న కారు యజమానులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానకులు వాపోతున్నారు. ఇదంతా బహిరంగంగా కనిపిస్తున్నా జీవీఎంసీ అధికారులు గాని, సచివాలయ సిబ్బంది గాని కిమ్మనడం లేదు. దీంతోఆక్రమణదారులకు అడ్డే లేకుండా పోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విధంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక మర్మమేమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఇలాంటి ఆక్రమణలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



కారు వాష్ షెడ్డు ముందు రోడ్డుపైనే పార్కింగ్ చేసిన కార్లు

ఎస్‌బీఐలో ఉచిత వైద్య శిబిరం


దంత పరీక్ష చేస్తున్న వైద్యులు

సీతంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వి హెల్త్ కేర్, వి డెంటల్ ఆసుపత్రులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బ్యాంక్ ఖాతాదారులకు, ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అధిక రక్తపోటు (బీపీ), చక్కెర వ్యాధి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎస్.దుర్గాప్రసాద్, డాక్టర్ వి.సర్వలత, వి హెల్త్ కేర్ డైరెక్టర్ కేఎంకే రమేష్, క్లినిక్ హెడ్ సీహెచ్ కృష్ణ, సిబ్బంది లతీష్, తులసి, లిఖిత సేవలందజేశారు.

విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్

మహారాణిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ క్వీన్‌మేరీస్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులకు వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు వి.జోగేంద్రనాథ్ తెలిపారు. ఐటీ ఐటీఈఎస్ విద్యార్థులకు భవిష్యత్‌లో చాలా అవసరమన్నారు. విశాఖ జీసీడీవో కాలేషా బేగం, జిల్లా కో-ఆర్డినేటర్ రుషి పర్యవేక్షిస్తారు. ఒకేషనల్ ట్రైనర్ సంధ్య విద్యార్థినులకు మార్గదర్శకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

కవి సమ్మేళనానికి ఆహ్వానం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో మే 8న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వహించే అంతర్జాతీయ కవి సమ్మేళనంలో కవితా గానం చేసేందుకు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎంవీ ధర్మారావుకు ఆహ్వానం అందింది. భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడే సాబ్ ఆయనకు ఆహ్వానం పంపారు. తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఉపాధ్యాయుడు ధర్మారావు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద రోడ్డుపై భిక్షాటన చేసుకునే గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఇతనికి సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయసు ఉంటుంది. స్థానిక 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు, రవిబాబులు 'అవర్‌హ్యాండ్' అనే స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇవ్వడంతో ఆ సంస్థ అధ్యక్షుడు పిల్లి గోవిందరాజు మంగళవారం తమ బృందంతో అక్కడకు వచ్చారు. అనాథ మృతదేహానికి కాన్వెంటు శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపించారు.

ఉక్కులో 'ప్రి మెచ్యూర్ రిటైర్‌మెంట్'

... 5వ పేజీ తరువాయి

న్యాయమని ప్రశ్నిస్తున్నారు. గతంలో రిటైర్‌మెంట్ వయస్సు 58 ఏళ్లుగా ఉండగా, ఉద్యోగుల అనుభవం అవసరమని నాటి ప్రధాని వాజపేయి రిటైర్‌మెంట్ వయసును 60 ఏళ్లకు పెంచారని, ఇప్పుడు వారికి జీతాలు ఇవ్వడం ఇబ్బందిగా ఉందని, ఏకంగా పదేళ్లు తగ్గించేసి 50 ఏళ్లకే ఇంటికి పంపడం దారుణమని విమర్శిస్తున్నారు. ఈ నిర్ణయాలను ఎవరైనా వ్యతిరేకిస్తే వారిని కూడా ఇంటికి పంపించేయాలని చూస్తున్నారని పలువురు వాపోతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె వాయిదా

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో సరిగా పనిచేయని వారిని, విధులకు హాజరుకాని వారిని మాత్రమే తొలగిస్తామని, ఆ స్థానంలో ఇప్పటికే తొలగించిన 1,503 మందిలో బాగా పనిచేసే వారిని తిరిగి తీసుకుంటామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును రెండు నెలల పాటు వాయిదా వేయాలని, ఈలోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని కార్మిక నాయకులు కోరగా...మే 20వ తేదీ వరకు ఎవరినీ తొలగించబోమని యాజమాన్యం హామీ ఇచ్చింది. దీంతో కార్మిక నిరవధిక సమ్మెను మే 20వ తేదీ వరకు వాయిదా వేస్తున్నామని కార్మిక సంఘ నాయకులు ప్రకటించారు. ఇదిలావుండగా మే 20వ తేదీలోపు మరోసారి ఆర్‌ఎల్‌సీ సమక్షంలో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్ల అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది. ఈ చర్చల్లో స్టీల్‌ప్లాంట్ అధికారులు గాంధీ, ఖర్, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మంత్రి రవి, నీరుకొండ రామచంద్రరావు, కె.వంశీకృష్ణ, సొంబాబు, శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.

దారిలో వాహనాలు నిలిపేస్తే ఎలా?

మురళీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాధవధార, బిర్లా జంక్షన్, ఊర్వశి హైవే ప్రాంతాల్లోని సర్వీసు రోడ్డు వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. గ్రేటర్ 51వ వార్డు అప్పయ్య నగర్ నివాసిత ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న హైవే నాలుగో లైను సర్వీసు రోడ్డుతో నాలుగు వరుసల రహదారి పూర్తవుతుంది. తిరిగి ఎయిర్‌పోర్ట్, షీలానగర్ దాటే వరకు ఎక్కడా సర్వీసు లైను కనిపించదు. ఇటు నగరంలోకి వెళ్లే దారిలోకి మళ్లే వాహనాలు ఒక్కసారిగా ఆర్‌అండ్‌బీ వద్దే సర్వీసు లైనులోకి మళ్లుతాయి. ఇలాంటి కీలక మార్గంలో ఆర్‌అండ్‌బీ మారియట్ హోటల్ నుంచి అప్పయ్యనగర్ నివాస లేఅవుట్‌లో శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట, బిర్లా జంక్షన్ డీమార్ట్, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం, ఊర్వశి, పాలిటెక్నిక్ కళాశాలల వరకు రోడ్డు ఖాళీ ఉండటం లేదు. ఈ ప్రాంతాల్లో ఇటీవల విస్తరించిన వాణిజ్య సముదాయాలతో పాటు ప్రధానంగా హోటళ్లు, డీమార్ట్ వ్యాపారం, పాస్‌పోర్టు కోసం హైవేపైనే వాహనాలు నిలిపేసి డివైడర్లపై వేచి ఉంటున్న అభ్యర్థులతో సర్వీసు లైన్ పార్కింగ్ ప్రాంతంగా తయారైంది. నగరంలోకి ప్రవేశించే దారి కనిపించడం లేదు. హైవే సెంటర్ లైన్‌లో ఆటోలు వెళ్లకూడదనే నిబంధన కారణంగా సర్వీసు లైనులో దూసుకొస్తున్న ఆటో వాలాలతో హైవే సర్వీసు రోడ్డు రోజంతా రద్దీగా ఉంటోంది. పార్కింగ్ చేసి ఉంటున్న బైకుల నుంచి వ్యాన్‌లు, లారీలు, ట్రావెల్ బస్సులతో చిక్కులు ఏర్పడుతున్నా కంచరపాలెం ట్రాఫిక్ విభాగం పోలీసులు స్పందించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. హైవే సర్వీసు లైనులో రాకపోకలు సాఫీగా సాగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


ఆర్‌అండ్‌బీ వేంకటేశ్వరస్వామి ఆలయ మార్గంలో నిలిపివేసిన వాహనాలు

వక్ఫ్ సవరణ చట్టం ఉపసంహరణకు డిమాండ్


సంఘీభావాన్ని ప్రకటిస్తున్న ముస్లింలు, మేధావులు, సీఐటీయూ నాయకులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, దీన్ని ఉపసంహరించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ విశాఖ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.అష్రఫ్ అధ్యక్షత వహించారు. ముస్లిం సంఘాలు, మసీద్ పెద్దలు మున్నీరు, అహ్మద్‌ఖాన్, అబిద్‌బేగం, ఎదీన్, మున్నీషా, సీపీఐఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్పొరేటర్ బి.గంగారావు, ఆర్కేఎస్వీ కుమార్ పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. సవరించిన చట్టంలో మార్పులు ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను చీల్చి తన హిందూత్వ అజెండాను ముందుకు తెస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులను నిర్ధారించే అధికారాన్ని సర్వే కమిషనర్ నుంచి ప్రభుత్వం నియమించిన రెవెన్యూ అధికారులకు బదిలీ చేయడం ద్వారా ఆరాధనా స్థలాలు, విద్యాసంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వృత్తివిద్యా కేంద్రాలను స్వాధీనం చేసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందన్నారు.

మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత మహిళల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రైల్వే వెయిట్ లిఫ్టింగ్ హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజర్ జసఫ్ కబీర్ అన్సారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధ్యానచంద్ అవార్డీ, వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష, రైల్వే వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తొలి పోటీల్లో: 45 కిలోల కేటగిరిలో జి.హిమ నాగమణి, సబిత సేనాపతి, యు.పద్మిని; 49 కిలోల విభాగంలో పి.నాగమణి, జి.నీలిమ, సిబాని పాణిగ్రహి; 55 కిలోల విభాగంలో ఎస్.పార్వతి, ఎం.వి.లక్ష్మీ, జీరా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

ఆహారంలో శుచి, రుచి ఉండేలా చర్య తీసుకోండి


కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీజీవీఎం సభ్యులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వ్యాపారులు శుచి, శుభ్రతతో కూడిన ఆహారాన్ని మాత్రమే అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు కేవీజీవీఎం సభ్యులు విజ్ఞప్తి చేశారు. కేవీజీవీఎం నగర ఇన్‌చార్జ్ కొండవ గాయత్రీ ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం కలెక్టర్‌ను కలిశారు. మంచి ఆహారాన్ని ప్రజలకు అందించాలని, ఆహార కల్తీ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో అభ్యర్థించారు. సభ్యులు దీప్తి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠగిరి ధర్మకర్తకు కేంబ్రిడ్జి డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న వైకుంఠగిరి ధర్మకర్త కర్రి సముద్రారెడ్డి

సీతమ్మధార, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాశీపట్నంలోని వైకుంఠగిరి అనంత వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించినందుకు సీతమ్మధార ప్రాంతానికి చెందిన ధర్మకర్త కర్రి సముద్రారెడ్డికి కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ ఆధ్యాత్మిక రంగంలో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సముద్రారెడ్డి మంగళవారం ఢిల్లీలో ఈ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాన హైకమిషనర్ లూయిస్ ఓబంగ్, పాలస్తీనా ఎంబసీ కౌన్సిలర్ బాసిమ్ ఎఫ్ హిల్సి, బాలీవుడ్ హీరో రాహుల్ రాయ్‌లు విచ్చేశారని సముద్రారెడ్డి తెలిపారు. సుమారు నాలుగు వేల అడుగుల ఎత్తున కొండపై వైకుంఠగిరి లాంటి పెద్ద క్షేత్రాన్ని నిర్మించడం భారత దేశంలో ఎన్నో ఆధ్యాత్మిక సంస్థలకు దారి చూపినట్లవుతుందని అతిథులు అన్నారు. చాలా క్లిష్టమైన అరణ్య ప్రాంతంలో కనీస సౌకర్యాలు కూడా లేని సుమారు 18 కిలోమీటర్ల ఘాటు రోడ్డులో నిర్మాణం చేపట్టడం చాలా సాహసోపేతమని అభివర్ణించారు. ఇంత మంచి ప్రజా ప్రయోజన కార్యక్రమం చేపట్టిన కర్రి సముద్రారెడ్డికి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందించడం అభినందనీయమన్నారు. గ్రూప్ ఉపాధ్యక్షులు యూఎన్ మల్లిక్, ఐఏఎస్‌లు, పలు యూనివర్సిటీల సీఈవోలు, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వర్‌ను కఠినంగా శిక్షించాలి

మహారాణిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పోతిన మల్లయ్యపాలెంలో నిండు గర్భిణి అనూషను అమానుషంగా హతమార్చిన ఆమె భర్త జ్ఞానేశ్వర్‌ను అత్యంత కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అత్తిలి విమల డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ హోంమంత్రి అనిత ఉంటున్న విశాఖ నగరంలోనే ఇంత దారుణమైన సంఘటన జరిగినప్పటికీ ఇంతవరకు ఆమె స్పందించకపోవటం దారుణమని అన్నారు. కూటమి పాలనలో జరుగుతున్న నేరాలు, మహిళలపై దాడులను కట్టడి చేసి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ నాయకులు కె.వనజాక్షి, ఎండీ బేగం తదితరులు పాల్గొన్నారు.


కేజీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా నాయకులు

విమానాశ్రయంపై చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

ఆపేశారు. దీనివల్ల వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాగే ఈ నెలాఖరు నుంచి అంతర్జాతీయ సర్వీసులు బ్యాంకాక్, మలేషియాలకు బుకింగ్స్ ఆపేశాయి. ఇక మిగిలింది సింగపూర్ విమానం ఒక్కటే. రాష్ట్రంలో విదేశీయులు ఎక్కువ మంది వచ్చే నగరం తిరుపతి. ఆ తరువాత విశాఖపట్నమే. అలాంటి నగరానికి అంతర్జాతీయ సర్వీసులు రద్దయిపోతున్నాయి. గతంలో ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ విమాన సంస్థలతో చర్చించి గోవా, భువనేశ్వర్, కోయంబత్తూర్, పుణే నగరాలకు విమాన సర్వీసులు వేయించింది. అవన్నీ నిలిచిపోయాయి. ఆకాశ్ ఎయిర్ ముంబై సర్వీస్ నిలిపివేసింది. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా వెలుగొందుతున్న విశాఖ నుంచి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఎయిర్ కనెక్టివిటీ అవసరం. ఈ విషయంలో ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవ తీసుకోవలసి ఉంది. కొత్త విమాన సర్వీసులు తెప్పించాల్సి ఉంది.

ఉడాన్ యాత్రీ కేఫ్‌ల అవసరం

కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయాల్లో ఆహార పదార్థాల ధరలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటి కారణంగా ప్రయాణికులు ఆకలితో ఉండకూడదని ఇటీవల 'ఉడాన్ యాత్రీ కేఫ్'లు ప్రారంభించింది. విమానాశ్రయంలో వీటిని ఏర్పాటు చేసి టీ, కాఫీ, టిఫిన్ ఏదైనా 20 రూపాయలకే ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ఇటువంటి క్యాంటీన్‌ను ఇటీవలే చెన్నై విమానాశ్రయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. విశాఖ విమానాశ్రయంలో రెండు ఇడ్లీ రూ.180కి విక్రయిస్తున్నారు. టీ లేదా కాఫీ తాగితే రూ.100 చెల్లించాలి. ఈ విమానాశ్రయం నుంచి రోజుకు సగటున నాలుగు వేల మంది ప్రయాణిస్తున్నారు. ఇక్కడ కూడా ఆ క్యాంటీన్ అవసరం ఉంది. కానీ మంత్రి ఆ దిశగా ఎటువంటి ప్రయత్నం చేయలేదు.

ఆర్థిక శాఖ మంత్రి చెప్పినా చర్యలు లేవు

విమానాశ్రయాల నుంచి సరకు రవాణా పెంచాలని, వాటిని ప్రోత్సహిస్తామని కొత్త బడ్జెట్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇటీవల ఆమె విశాఖ వచ్చినప్పుడు అపాటా ప్రతినిధులు విశాఖలో మల్టీ టెంపరేచర్ కోల్డ్ స్టోరేజీ సౌకర్యంతో కార్గో గోడౌన్ ఏర్పాటు చేయాలని కోరారు. దానికి ఆమె స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ పంపితే పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. దానిని కూడా కేంద్ర మంత్రి పట్టించుకోలేదు. రాష్ట్రానికి ఆర్థిక రాజధాని అని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం కూడా విశాఖ విమానాశ్రయంపై దృష్టిసారించాల్సి ఉంది.

కేంద్ర మంత్రితోనే సాధ్యం

విశాఖ విమానాశ్రయం సమస్యలు పరిష్కరించే సత్తా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు మాత్రమే ఉందని అపాటా ప్రతినిధులు నరేశ్‌కుమార్, కుమార్ రాజా, డీఎస్ వర్మ పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆయనకు ఓ లేఖ రాశారు. రద్దయిన సర్వీసులు పునరుద్ధరించాలని కోరారు.

ఆసక్తికరంగా రైల్వే ఫుట్‌బాల్ టోర్నీ


ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఫుట్‌బాల్ విజేత క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్గత ఫుట్‌బాల్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. ఫుట్‌బాల్ అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న టోర్నీలో భాగంగా మంగళవారం తొలి మ్యాచ్‌లో ఆపరేటింగ్ 2-0 గోల్స్‌తో సిగ్నల్ అండ్ టెలికాంపై, రెండో మ్యాచ్‌లో డీజిల్ లోకోషెడ్ 1-0 గోల్‌తో పర్సనల్ శాఖపై విజయం సాధించాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగిన చివరి మ్యాచ్‌లో టీఆర్‌డీ 1-0 గోల్ తేడాతో కమర్షియల్ శాఖపై గెలుపొందింది. ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాసరావు, గణేష్, తిరుమలరావులు ఈ మ్యాచ్‌లను నిర్వహించారు.

కిరాతకం

... 5వ పేజీ తరువాయి

కుటుంబ సభ్యులు అంగీకరించారు. కానీ, జ్ఞానేశ్వర్ మాత్రం తమ కుటుంబ సభ్యుల అంగీకరించరని, పెళ్లి తరువాత చెబుదామని అనూషను ఒప్పించాడు. 2022 డిసెంబరు పదో తేదీన సింహాచలంలో అనూష కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వివాహమైన తరువాత ఎనిమిది నెలలపాటు ఇద్దరూ బాగానే ఉన్నారు. ఆ తరువాత నుంచి జ్ఞానేశ్వర్ అసలు రంగు బయటపడుతూ వచ్చింది. పెళ్లి జరిగిన సుమారు ఏడాదికి తనకు బ్లడ్ కేన్సర్ ఉందని అనూషకు చెప్పాడు. తాను ఎక్కువ కాలం జీవించనని, తనను విడిచి వెళ్లిపోవాలని, నీ జీవితం నాశనం కాకూడదని అన్నాడు. అలా వదిలి వెళ్లబోనని, ఉన్నంత కాలం నీతోనే ఉంటానంటూ అనూష చెప్పినా...అతడు తన ప్రయత్నాలను ఆపలేదు. రక్తపు వాంతులు చేసుకున్నట్టు, తీవ్రమైన నీరసంతో బాధపడుతున్నట్టు నమ్మించే ప్రయత్నం చేశాడు. వైద్యం కోసమంటూ అనూష వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నాడు. ఆ తరువాత అనారోగ్య సమస్యను పక్కనపెట్టి తన కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని, నిన్ను చంపేస్తారంటూ అనూషను భయపెట్టడం మొదలుపెట్టాడు. ఇప్పటికైనా నీదారి నువ్వు చూసుకోవాలంటూ అనూషను వదిలించుకునే ప్రయత్నం చేశాడు. కానీ, అనూష 'నాకు సర్వం నువ్వే. ప్రాణాలు పోయినా నిన్ను వదిలి వెళ్లను' అని చెప్పింది. ఈ క్రమంలోనే అనూష గర్భం దాల్చింది. కొద్దిరోజులు అనూషను బాగానే చూసుకున్నట్టు నటించాడు. నాలుగు రోజుల కిందట ఫలూదా తీసుకువచ్చి అనూషకు ఇచ్చాడు. తాగే క్రమంలో ఒక టాబ్లెట్ బయటకు రావడంతో ఒక్కసారిగా అనూష షాక్ తింది. టాబ్లెట్ ఉన్న విషయాన్ని జ్ఞానేశ్వర్‌కు చెప్పి షాపునకు వెళ్లి నిలదీద్దామన్నది. దానికి సరేనన్న జ్ఞానేశ్వర్ టాబ్లెట్ పక్కన పెట్టాలని సూచించి బయటకు వెళ్లిపోయాడు. ఇదే విషయాన్ని అనూష కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా చెప్పింది. అప్పుడు కూడా జ్ఞానేశ్వర్‌పై అనుమానం రాలేదు. ప్రసవానికి సమయం దగ్గరపడడంతో ఆదివారం సాయంత్రం డాక్టర్ వద్దకు వెళ్లారు. ఆస్పత్రిలో చేరాలని వైద్యురాలు సూచించారు. అయితే, ఆదివారం ఎందుకు, సోమవారం చేరుదామని చెప్పి అనూషను ఇంటికి తీసుకువెళ్లాడు. అదేరోజు ఉదయం అనూష అమ్మమ్మ తుమ్మలపల్లి అన్నవరం కాకినాడ నుంచి వచ్చారు. రాత్రి ఆస్పత్రి నుంచి వచ్చిన ఇద్దరికీ అన్నం పెట్టింది. ఇద్దరూ రూమ్‌లోకి వెళ్లారు. అనూష అమ్మమ్మ హాల్‌లో పడుకుంది. సోమవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో వాళ్లున్న గదిలోకి అనూష అమ్మమ్మ వెళ్లింది. అప్పటికీ నిద్రలో ఉన్నట్టు కనిపించిన అనూషను తట్టి లేపే ప్రయత్నం చేసింది. ఎంతసేపటికీ లేవకపోవడంతో పక్కనే కుర్చీలో కూర్చుని సెల్‌ఫోన్ చూసుకుంటున్న జ్ఞానేశ్వర్‌తో అమ్మాయి లేవడం లేదు...చూడాలని చెప్పింది. ఏమీ తెలియనట్టు చెంపలపై కొడుతూ లే అనూష...అంటూ నాటకాలాడే ప్రయత్నం చేశాడు. అనూష లేవడం లేదని, ఏమైందో తెలియడం లేదంటూ అనూష అమ్మమ్మకు చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె ఎదురింటి వాళ్లను పిలిచింది. అనూష స్నేహితులకు జ్ఞానేశ్వర్ విషయాన్ని తెలియజేయడంతో వారంతా ఇంటికి చేరుకున్నారు. తొలుత దగ్గరలోని రెండు ఆస్పత్రులకు కారులో తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో కేర్‌కు తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు చనిపోయిందని నిర్ధారించారు. అనూష తనను విడిచి వెళ్లిపోయిందని, తాను ఎలా బతకాలంటూ జ్ఞానేశ్వర్ నాటకాన్ని రక్తికట్టించే ప్రయత్నం చేశాడు.

గాయాలతో అనుమానం

కేర్ నుంచి అనూషను ఇంటికి తీసుకువెళ్లిపోయేందుకు జ్ఞానేశ్వర్ ప్రయత్నించాడు. అయితే, జ్ఞానేశ్వర్ ముఖం, చేతిపై గాయాలు ఉండడాన్ని గుర్తించిన అనూష స్నేహితుడు ఆదర్శ్‌కు అనుమానం వచ్చింది. తన తల్లిని కేర్ ఆస్పత్రికి రమ్మని చెప్పాడు. ఆమె కేజీహెచ్‌లో పనిచేస్తున్నారు. మెడపై కొన్ని మచ్చలు ఉండడం, శరీరం పూర్తిగా నల్లగా మారిపోవడంతో కేజీహెచ్‌కు తీసుకువెళదామని ఆమె చెప్పారు. దానికి జ్ఞానేశ్వర్ వద్దంటూ వారించే ప్రయత్నం చేశాడు. కానీ, అంతా తీసుకువెళ్లాల్సిందేనని పట్టుబట్టడంతో వారితోపాటు అంబులెన్స్‌లో ఎక్కి కేజీహెచ్‌కు వెళ్లాడు. అక్కడి వైద్యులు కూడా చనిపోయిందని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులు గట్టిగా అడగడంతో తొలుత తానే చంపేశానని చెప్పాడు. ఆ తరువాత ఉరి వేసుకుందని చెప్పాడు. మళ్లీ గట్టిగా అడగడంతో తనకు ఇష్టం లేదని అందుకు చంపేసినట్టు అంగీకరించాడు. అమ్మాయికి పెళ్లి జరిగినప్పుడు తనకు ఆరోగ్యం బాలేదని, కోమాలో ఉన్నానని, ఇప్పుడు తన బిడ్డను పూర్తిగా దూరం చేశాడని ఆమె తల్లి పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. తన బిడ్డకు ప్రసవం సమయంలో తోడుగా ఉండాలని వచ్చానని, తాను ఇంట్లో ఉండగానే బిడ్డ ప్రాణాలు తీసేశాడని అనూష అమ్మమ్మ అన్నవరం విలపించారు.

అంత్యక్రియలు పూర్తి..

అనూష కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చారు. వారి డిమాండ్ మేరకు అనూషను వారి స్వగ్రామమైన దువ్వాడ తీసుకువెళ్లి వారి కోడలిగా అంత్యక్రియలను నిర్వహించారు. పోయిన ప్రాణాన్ని తాము తీసుకురాలేకపోయినా వారి ఇంటి కోడలిగా గుర్తింపు తెచ్చుకోవాలని భావించిన అనూషకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించడం ద్వారా ఆత్మశాంతి కలిగించే ప్రయత్నం చేశామని అనూష మరిది స్వరూప్ తెలిపారు. ఇకపోతే, అనూష గర్భంలో ఆడ బిడ్డ ఉన్నట్టు పోస్టుమార్టం సమయంలో తేలింది.

గ్రేటర్‌లో మారుతున్న సమీకరణాలు

... 5వ పేజీ తరువాయి

అప్పటికి 72 మంది సభ్యులు మాత్రమే ఉండడంతో సంఖ్యా బలం పెంచుకోవడంపై నేతలు దృష్టిపెట్టారు. ఈలోగా తమ కార్పొరేటర్లను చేజారకుండా కాపాడుకునేందుకు కొద్దిరోజుల కిందట మలేషియా తరలించారు. వైసీపీకి చెందిన మరో ఇద్దరు కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు సాగించగా, సోమవారం నాటికి ముగ్గురిని కూటమిలోకి చేర్చుకోగలిగారు. దీంతో మేజిక్ ఫిగర్ కంటే ఒకరు అదనంగా ఉండడంతో ఈనెల 19 అవిశ్వాస తీర్మానం నెగ్గడం ఖాయమని కూటమి నేతలు ఊపిరిపీల్చుకున్నారు.

ఆందోళనకు గురిచేస్తున్న అసంతృప్తులు

అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా చేసేందుకు వైసీపీ నేతలు తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. టీడీపీ, జనసేన కార్పొరేటర్లతోపాటు ఇటీవల ఆయా పార్టీల్లో చేరిన వైసీపీ కార్పొరేటర్లలో అసంతృప్తితో ఉన్నవారిని గుర్తించే పనిలోపడ్డారు. గాజువాక ప్రాంతానికి చెందిన టీడీపీ కార్పొరేటర్ కొద్దిరోజులుగా వాట్సాప్‌లో టీడీపీ నేతలకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఆయనతో వైసీపీ నేతలు సంప్రతింపులు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇటీవల జనసేనలో చేరిన మహిళా కార్పొరేటర్ భర్త కూటమి నేతలపై అసంతృప్త గళం విప్పుతున్నట్టు సమాచారం. దీంతో ఆయన్ను కూడా వైసీపీ నేతలు కలిసినట్టు సమాచారం. ఇలాంటి ప్రచారం నేపథ్యంలో ఇప్పుడిప్పుడు ఊపిరిపీల్చుకుంటున్న కూటమి నేతల్లో ఆందోళన మొదలైందంటున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సేవలపై ఆరా

... 5వ పేజీ తరువాయి

ఎలా ఉంటుంది?, మీకు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా?, అవినీతి ఉందా?, పరిశుభ్రత ఎలా ఉందన్న...ప్రశ్నలు వేసి సమాధానాలను రాబడుతున్నారు.

కొన్నింటిపై ప్రజల్లో అసంతృప్తి

ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా? అనే ప్రశ్నకు జనవరిలో 66 శాతం మంది ప్రజలు అవును అని సమాధానం చెప్పగా, 34 శాతం మంది ఉండడం లేదన్నారు. ఫిబ్రవరిలో 79.44 మంది ఉంటున్నారని, 20.56 శాతం మంది ఉండడం లేదని, మార్చిలో 72.4 శాతం మంది అందుబాటులో ఉన్నారని చెప్పగా, 27.6 శాతం మంది ఉండడం లేదని, ఏప్రిల్‌లో 10వ తేదీ వరకు 74 శాతం మంది ఉంటున్నారని చెప్పగా, 26 శాతం మంది ఉండడం లేదని స్పష్టం చేశారు. డాక్టర్ ప్రవర్తన ఎలా ఉందన్న ప్రశ్నకు...జనవరిలో 65.39 శాతం మంది బాగుందని సమాధానం చెప్పగా, 34.01 శాతం సరిగా లేదన్నారు. ఫిబ్రవరిలో 68 శాతం మంది బాగుందని, 32 శాతం మంది బాగాలేదని, మార్చిలో 72 శాతం మంది బాగుందని, 28 శాతం మంది బాగాలేదని చెప్పారు. ఏప్రిల్‌లో 71 శాతం మంది బాగుందని, 29 శాతం మంది బాగాలేదన్నారు. సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందన్న ప్రశ్నకు జనవరిలో 63.91 శాతం మంది బాగుందని చెప్పగా, 36.09 శాతం బాలేదని సమాధానమిచ్చారు. ఫిబ్రవరిలో 64.36 శాతం మంది బాగుందని, 35.64 శాతం మంది బాగాలేదని, మార్చిలో 62.28 శాతం మంది బాగుందనగా, 37.72 శాతం మంది బాలేదని, ఏప్రిల్‌లో 64 శాతం మంది బాగుందని చెబితే...36 శాతం మంది బాగుండడం లేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా.? అన్న ప్రశ్నకు జనవరిలో 57 శాతం మంది ఇచ్చారని చెప్పగా, 43 శాతం మంది ఇవ్వలేదన్నారు. ఫిబ్రవరిలో 61.77 శాతం మంది ఇచ్చారని, 38.23 శాతం మంది ఇవ్వలేదన్నారు. మార్చిలో 60.85 శాతం మంది ఇచ్చారని, 39.15 శాతం మంది ఇవ్వలేదని, ఏప్రిల్‌లో 68 శాతం మంది ఇచ్చారంటే, 32 శాతం మంది ఇవ్వలేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఏదైనా అవినీతిని గమనించారా?...అన్న ప్రశ్నకు జనవరిలో 63 శాతం మంది ఉందని చెప్పగా, 37 శాతం మంది లేదన్నారు. ఫిబ్రవరిలో 60 శాతం మంది అవినీతి ఉందంటే, 40 శాతం మంది లేదని, మార్చిలో 49 శాతం మంది ఉందని, 51 శాతం మంది లేదని, మార్చిలో 41 శాతం మంది ఉందని చెప్పగా, 59 శాతం మంది లేదని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశుభ్రత ఎలా ఉందన్న ప్రశ్నకు జనవరిలో 60 శాతం బాగుందని చెప్పగా, 40 శాతం మంది బాగాలేదని, ఫిబ్రవరిలో 46 శాతం మంది బాగుందని, 54 శాతం మంది బాగాలేదని, మార్చిలో 43 శాతం మంది బాగుందని, 57 శాతం మంది బాగాలేదని, ఏప్రిల్‌లో 49 శాతం మంది బాగుందంటే, 51 శాతం మంది బాగుండడం లేదని చెప్పారు.

ఇదీ యాక్షన్..

ఆయా ప్రశ్నలకు వచ్చిన సమాధానాలను బట్టి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆస్పత్రి అధికారులు ఎప్పటికప్పుడు సేవలు అందుతున్న తీరును పరిశీలించాలని ఆదేశించింది. విజిలెన్స్ తనిఖీలు నిర్వహించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. డ్యూటీలకు హాజరుకాని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చారు. ఉత్తమ పనితీరు కనబరిచే వైద్యులు, స్టాఫ్ నర్సులకు అవార్డులు ఇవ్వాలని సూచించింది. మందులు సరఫరా తగినంత ఉండేలా సెంట్రల్ మెడిసిన్ మానిటరింగ్‌సెల్ ఏర్పాటుచేసుకోవాలని ఆస్పత్రులకు సూచించారు. అవినీతి నిర్మూలనకు విజిలెన్స్ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఆస్పత్రుల్లో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటుచేయాలని, ఎక్కడికక్కడ పోస్టర్స్ ఏర్పాటుచేయాలని ఆస్పత్రి అధికారులకు ఉన్నతాధికారులకు సూచించారు.



పైపు లైన్ స్ట్రక్చర్ తగిలి పైకి లేచిన డంపర్ ముందు భాగం

స్టీల్‌ప్లాంటులో తప్పిన ప్రమాదం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ విభాగం సమీపంలోని పైపు లైపు లైన్ స్ట్రక్చర్‌ను ఓ డంపర్ ఢీకొంది. ఇందుకు సంబంధించి ఉద్యోగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్ ఫీల్డ్ మిషనరీ విభాగం (ఎఫ్‌ఎండీ) విభాగానికి చెందిన డంపర్ మెటీరియల్‌ను కోక్-ఓవెన్ విభాగం సమీపంలోని అన్‌లోడ్ చేసి బాడీని కిందకు దించకుండా బయలుదేరింది. ఈ క్రమంలో కోక్ ఓవెన్ విభాగం సమీపంలోని పైపు లైన్ స్ట్రక్చర్‌ను ఢీకొంది. అయితే పైపు లైన్‌కు ఎటువంటి డ్యామేజీ జరగలేదు. దీంతో ఉద్యోగులు అక్కడకు చేరుకుని డంపర్ వెనక భాగాన్ని కిందకు దించారు. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నూతన కార్యవర్గం

గోపాలపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. స్థానిక కుమారి కల్యాణ మండపంలో జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో నూతక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎస్.కోటేశ్వరరావు, ఏఎన్ నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా పి.త్రినాథరావు, కార్యదర్శిగా పి.రాజు, సహాయ కార్యదర్శిగా కె.కన్నారావు, ఉపాధ్యక్షుడిగా కె.రాజు, కోశాధికారిగా కె.రవి, సలహాదారులుగా జె.శ్రీనివాసరావు, పి.లోవరాజు, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు జీడీఏ, ఈసీయూ, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడి స్కిల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7995013421 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 28, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 14, క్యారెట్ 28 దొండకాయలు 18, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240



పచ్చికబయలులా మారిన చంద్రనగర్‌లోని ఎర్ర చెరువు



గుర్రపుడెక్క, పూడికతో నిండిన కొత్తపాలెం పెద్ద చెరువు

పూడికతో నిండిన చెరువులు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గోపాలపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం సహజసిద్ధంగా ఏర్పడిన చెరువులు ఏళ్లతరబడి నిర్లక్ష్యానికి గురవ్వడంతో అభివృద్ధికి నోచుకోక పూడికతో నిండి దుర్భరంగా మారాయి. ఫలితంగా పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు, ఎర్ర చెరువులు ఉన్నాయి. శతాబ్దం క్రితం సహజసిద్ధంగా ఏర్పడిన ఈ చెరువులకు ఆంగ్లేయుల కాలంలో చెక్‌డ్యామ్‌లు, లాకులను ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారు. దీంతో కొన్ని దశాబ్దాల క్రితం వరకూ ఈ చెరువుల నీటితో రైతులు వ్యవసాయం చేసేవారు. కాలక్రమేణా ఈ ప్రాంతంలో జనావాసాలు పెరగడంతో చెరువుల అభివృద్ధిపై ఎవరూ శ్రద్ధ చూపకపోవడంతో సుమారు 20 శాతం కబ్జాకు గురయ్యాయి. చెరువులు కూడా పూడికతో నిండిపోయి మైదానంలా మారాయి. ఈ క్రమంలో చెరువుల చుట్టూ ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాలు కూడా సుమారు 30 అడుగుల మేరకు తగ్గుముఖం పట్టాయి.

అధికారులు పరిశీలించినా చర్యలు శూన్యం

కొత్తపాలెంలోని చెరువలను గడిచిన దశాబ్ద కాలంలో పలువురు గ్రేటర్ కమిషనర్‌లు, జాయింట్ కలెక్టర్‌లు ఎన్నోసార్లు పరిశీలించారు. చెరువుల్లో పూడికతీత చేపట్టి చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు కూడా చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా అవి కార్యరూపం దాల్చలేదు. చెరువుల అభివృద్ధికి రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమష్టిగా చర్యలు చేపడితే గానీ అభివృద్ధి జరిగే అవకాశం లేదు. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించి రెవెన్యూ, జీవీఎంసీ అధికారులను సమన్వయపరచి చెరువులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడితే వాటి పరిరక్షణతో పాటు భూగర్భ జలాలు కూడా సమృద్ధిగా పెరిగి అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి ఎన్.గోపీకృష్ణ

పెదగంట్యాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి ఎన్.గోపీకృష్ణ అన్నారు. అగ్ని ప్రమాదాలు వాటిల్లితే ప్రాణ, ధన నష్టాలను అంచనా వేసే కన్నా అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే మేలన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పెదగంట్యాడ అగ్నిమాపక దళం పారిశ్రామిక ప్రాంతంలోని గాజువాక చేపల మార్కెట్, పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రం ఆవరణ, దువ్వాడ రైల్వేస్టేషన్, పాలవలసల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఈ సందర్భంగా గోపీ కృష్ణ అగ్నిమాపక వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. సాధారణంగా గృహాల్లో వుడ్ ఫైర్, ఎలక్ట్రికల్ ఫైర్ జరిగేందుకు అవకాశం ఉంటుందని, వీటిపై కుటుంబంలోని పెద్దలు పిల్లలకు అవగాహన కల్పించి అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తలు, తీసుకోవలసిన చర్యలను వివరిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. పరిశ్రమల్లో మెటాలిక్, ఆయిల్ ఫైర్, ఎలక్ట్రికల్, మెటీరియల్ ఫైర్ జరిగే అవకాశం ఉంటుందని, అటువంటి ప్రదేశాల్లో డిటెక్టర్లు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రమాదాన్ని వెంటనే గుర్తించి అదుపు చేయవచ్చునన్నారు. మండే గుణమున్న వ్యర్థాలను పరిశ్రమల్లో, ఇళ్లలోను నిల్వ ఉంచరాదని సూచించారు. గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వస్తే ఎలా అదుపు చేయాలో ప్రత్యక్షంగా గృహిణులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో లీడింగ్ ఫైర్‌మెన్‌లు ఏవీ రాజు, బి.సింహాచలం నాయుడు, ఫైర్‌మెన్‌లు అనిల్, సురేశ్, మంగునాయుడు, హోమ్‌గార్డు రవి, తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ లీకైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరిస్తున్న సిబ్బంది



పూజలందుకున్న బొర్రమాంబ, అమ్మవారిని దర్శించేందుకు క్యూలో వేచివున్న భక్తులు

వైభవంగా బొర్రమాంబ జాతర

- అమ్మవారిని దర్శించేందుకు తరలివచ్చిన భక్తులు

అగనంపూడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బొర్రమాంబ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట నుంచే అమ్మవా దర్శనాలను ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయంతో పాటు పరిసర కిటకిటలాడాయి. తొలుత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పాత అగనంపూడి నుంచి నిర్వాసిత గ్రామాల మీదుగా ఊరేగించి తిరిగి ఆలయం వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం అనుపోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. జాతరను పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, స్థానిక నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, చిత్తా కనకరాజు, జి.సోమశేఖర్, కె.సత్యారావు, గల్లా రాజు, ఎం.విజయ్, మామిడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దుర్గమాంబ ఉత్సవాలు

జీవీఎంసీ 85వ వార్డు పరిధి డొంకాడ ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఉత్సవాలను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నారు. ఇందులో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బుధవారం రాత్రి అమ్మవారికి కోటి దీపాల జాతరతో పాటు తొలేళ్లు, గురువారం అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ రెండు రోజులూ రాత్రి 7 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పురుషోత్తపురంలో బోర పైడిమాంబ పండగ

పెందుర్తి-రూరల్: పురుషోత్తపురం గ్రామస్థుల ఇలవేల్పు బోర పైడిమాంబ పండగను ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తెలుగు యువత నాయకుడు శ్రీను యాదవ్ ఆహ్వానం మేరకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గంట్ల దివాకర్, దాట్ల మధు, కరక దేముడు, లక్కీ గోవింద్, కోరాడ శ్రీను, అశోక్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంచుమాంబ అనుపోత్సవం

పెదగంట్యాడ: పెదగంట్యాడ నిర్వాసిత కాలనీవాసుల ఆరాధ్య దేవత శ్రీ కుంచుమాంబ అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజాము 4 గంటల నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం అనుపోత్సవాన్ని జరిపారు. సిద్ధేశ్వరం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు ఫైర్ స్టేషన్, పెదగంట్యాడ కూడలి మీదుగా కుంచుమాంబ అమ్మవారి ఆలయం వరకు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల మధ్య సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది.



చిన్నార్నుల మీదుగా ఘటాలను తీసుకువెళ్తున్న దృశ్యం

సింహగిరి కాలనీని సందర్శించిన వీఎంఆర్డీఏ కమిషనర్

వేపగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి కాలనీ రామాలయం వెనక వుడా స్థలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై అభ్యంతరాలు రావడంతో మంగళవారం వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ ఆ స్థలాన్ని పరిశీలించారు. రామాలయాన్ని ఆనుకుని ఉన్న సుమారు 30 సెంట్ల స్థలంలో యువకులు క్రికెట్, వాలీబాల్ ఆడుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఇక్కడ అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు వీఎంఆర్డీఏ అధికారులు నిర్ణయించారు. గతంలోనూ ఇక్కడ నిర్మాణానికి యత్నించగా కాలనీవాసుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో వెనుదిరిగారు. మళ్లీ ఇప్పుడు భూ పరీక్షలు నిర్వహించడంతో అగ్నిమాపక కేంద్రం కోసం మరోచోట స్థలం కేటాయించాలని స్థానికులు వీఎంఆర్డీఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీంతో కమిషనర్ ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థకు కేటాయింపులు చేయడం, టెండర్ల ప్రక్రియ జరుగుతున్నందున స్థల మార్పు చేయలేమని, క్రీడల కోసం సమీపంలోని పార్కుల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తామని విశ్వనాథన్ హామీ ఇచ్చారు. కాలనీ పరిసరాల్లో గల రెండు, మూడు స్థలాలను పరిశీలించారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులు, వీఎంఆర్డీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను నగర సీపీ శంఖబ్రత బాగ్చీ మంగళవారం సందర్శించారు. స్టేషన్ మొత్తాన్ని పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగ ఉంచాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు పెంచాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలను నిశితంగా పరిశించాలన్నారు. స్టేషన్‌లో గల పెండింగ్ వాహనాలను పరిశీలించి వీటి డిస్పోజల్‌కు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రికార్డు అప్‌డేట్‌గా ఉండాలని పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పెట్రోల్ బంక్‌ను నిర్వహించాలి: సీపీ

పెదగంట్యాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌ను నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి నిర్వాహకులకు, సిబ్బందికి సూచించారు. బీసీ రోడ్డులోని పెదగంట్యాడ వద్దనున్న పోలీస్ వెల్ఫేర్ పెట్రోలు బంక్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వారి సహకారంతో నగర పోలీస్ శాఖ ఈ పెట్రోలు బంక్‌ను నిర్వహిస్తున్నది. పెట్రోల్ బంక్ అన్ని అవుట్‌లెట్లు, బంక్ పరిసరాలు, కార్యాలయాన్ని సీపీ తిలకించారు. బంక్ పనితీరును నిశితంగా గమనించారు. బంక్ పరిసరాలను మరింత అందంగా తీర్చిదిద్దాలని నిర్వాహకులకు సీపీ సూచించారు.

అగనంపూడిలో భారీ వర్షం



వర్షం కురుస్తున్న దృశ్యం

అగనంపూడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85వార్డుల పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మధ్యాహ్నం 3 గంటల వరకు తీవ్ర ఉక్కపోత, ఎండతో అవస్థలు పడిన ప్రజలకు ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని భారీ వర్షం కురిసి, వాతావరణం వాతావరణం చల్లబడడంతో ఊరట లభించింది. కాగా బొర్రమాంబ అనుపోత్సవంలో పాల్గొన్న భక్తులు వర్షానికి కాస్త ఇబ్బందులకు గురయ్యారు.



72వ వార్డు పరిధి మెహర్ నగర్‌లోని ఖాళీ స్థలం

ఖాళీ స్థలమా.. డంపింగ్ యార్డా?

- దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని ఆవేదన
- అధికారులు చర్యలు చేపట్టకపోతే ఆందోళనకు దిగుతామంటున్న మెహర్ నగర్ వాసులు

గాజువాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు పరిధి మెహర్ నగర్‌లోని భారీ భవంతుల మధ్య ఖాళీగా ఉన్న స్థలం డంపింగ్ యార్డుగా మారిందని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలానికి చేరువలోనే గణేశుని ఆలయం ఉండడంతో భక్తులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఈ స్థలం చుట్టూ సదరు యజమాని ప్రహరీ నిర్మించి విడిచిపెట్టడంతో పెద్ద పెద్ద చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పలువురు తమ ఇళ్లలోని చెత్తాచెదారాన్ని, వ్యర్థాలను ఇక్కడ పడేస్తున్నారు. దీంతో ఈ స్థలం ప్రస్తుతం చిన్నపాటి డంపింగ్ యార్డుగా మారిందని, భరించరాని దుర్వాసన వస్తుండడంతో పాటు తేళ్లు, ఇతర విష పురుగులు పరిసరాల్లోని ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం వర్షం కురిసిన మురుగు పేరుకుపోయి దుర్గంధం మరింత అధికమవుతుందన్నారు. స్థల యజమాని స్థానికంగా అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బందిగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. ఈ సమస్యను పలుమార్లు జీవీఎంసీ జోనల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే జోనల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని మెహర్‌నగర్‌వాసులు హెచ్చరిస్తున్నారు.

హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు



ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులతో ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన హైస్కూల్ ప్లస్ విద్యార్థులను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అభినందించారు. నియోజవకర్గంలోని గోపాలపట్నం, మల్కాపురం ప్రాంతాల్లోని హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మంగళవారం గణబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుశ్శాలువాతో గణబాబు సత్కరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెంలో మూడు కుటుంబాల ఇళ్లకు వెళ్లి రూ.4.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. గవరవీధిలో ఉంటున్న పాండ్రంగి ప్రదీప్‌కుమార్‌కు, రెడ్డి వీధిలోని జి.లహరీకి, గాంధీనగర్‌లోని ఓ కుటుంబానికి సీఎం రిలీఫ్ చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

క్షయ రోగులకు మెరుగైన వైద్య సేవలు



ఏరియా ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌కు విచ్చేసిన కేంద్ర బృంద ప్రతినిధులు, తదితరులు

అగనంపూడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో గల టీబీ యూనిట్‌ను సమగ్ర పర్యవేక్షణ నిమిత్తం కేంద్ర కమిటీ బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం ప్రతినిధులు డాక్టర్ శ్లాఘ్యశ్రీ, జయసాయిలు టీబీ యూనిట్‌ను పరిశీలించారు. టీబీ యూనిట్ ద్వారా నిత్యం రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయని ఆరా తీశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు రోగులతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అందుతున్న వైద్య సేవలతో పాటు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ అందుతుందా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. క్షయ వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందన్నారు. టీబీ రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు టీబీ కేంద్రాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఉష, ప్రత్యూష, సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

మల్కాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, ఆర్థికవేత్తగా విశేషమైన సేవలను అంబేడ్కర్ అందించారన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అంబేడ్కర్ అందకివాడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ కాస్లిన్, అధ్యాపకుడు బీపీ రాజు, జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి, గ్రంథాలయాధికారి శిరీష, సిస్టర్ ప్రేమకుమారి పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యావంతులై సమాజాభివృద్ధికి తోడ్పడాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనపరిచిన 5 నుంచి 18 ఏళ్ల వయసు గల బాలలకు కేంద్ర ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమశాఖ జాతీయ ప్రధానమంత్రి రాష్ట్రీయబాల పురస్కారాలను ప్రదానం చేస్తుందన్నారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర అంశాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన భారత సంతతికి చెందిన అర్హులు జూలై 31వ తేదీలోగా awards.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జోన్-1 కమిషనర్‌గా ఇపినాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-1 కమిషనర్‌గా వి.ఇపినాయుడును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇతను ప్రస్తుతం రామచంద్రాపురం మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుత జోన్- 1 కమిషనర్ ప్రసన్నవాణిని సీడీఎంఈలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న టీటీ రత్నకుమార్‌కు జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చింది.

జియాన్ కేంద్రాన్ని సందర్శించిన ఏసీపీ



నిర్వాహకులను ప్రశ్నిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ్

పెందుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిన ముషిడివాడలోని జియాన్ కేంద్రంలో పేపరు లీకు, మాస్ కాపీయింగ్ వ్యవహారంపై మంగళవారం ఏసీపీ పృథ్వీతేజ్ విచారణ చేశారు. కేంద్రాన్ని సందర్శించి పరీక్షకు హాజరైన అభ్యర్థుల బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ పరిశీలించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే కేంద్రాన్ని సీజ్ చేస్తామన్నారు. కేంద్రంపై నిరంతర నిఘా ఉంచాలని సీఐ కేవీ సతీశ్‌కుమార్‌ను ఆదేశించారు.

పోలమాంబకు నీరాజనం

» అంగరంగ వైభవంగా అమ్మవారి జాతర

» తెల్లవారుజాము నుంచి బారులు తీరిన భక్తులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరులో వెలసిన కరకచెట్టు పోలమాంబ అమ్మవారి పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము రెండు గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా బారులుతీరారు. సుమారు 2.5 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారని దేవదాయశాఖ అధికారులు తెలిపారు. పండగ సందర్భంగా పోలమాంబకు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.2 వేలు చెల్లించిన దంపతులకు సోమవారం రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 2.30 వరకు స్వహస్తాలతో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఉచిత, వికలాంగులు, గర్భిణులు, చంటి పిల్లల తల్లులకు, 80 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు ఉచితగా ప్రసాదం పంపిణీ చేశారు. పెదవాల్తేరులోని మద్దివారి పెద్దింటి నుంచి ఆలయం వరకు ఘటాలు, నేల వేషాలు, పులి వేషాలు, సాముగరడీలు, తప్పెటగుళ్లు, కోలాటం, కేరళ వాయిద్యాలు, బుట్టబొమ్మలు, తాడేపల్లిగూడెం స్పెషల్ కాళీ మాత డాన్స్ ప్రదర్శన, దాండియా, తదితర సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఘటాలను ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. దర్శనానికి క్యూలో ఉన్న భక్తులకు ఇబ్బంది లేకుండా తాగు నీరు, పాలు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఉత్సవంలో దేవాలయం ఈవో గాయత్రి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు





ఉత్సవంలో భాగంగా అలరించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు

మురుగునీటితో మునిగిన చావులమదుం



రహదారిపై భారీగా ప్రవహిస్తున్న మురుగునీటిలోనే వాహనాల రాకపోకలు



మురుగునీరు పోటెత్తడంతో రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

» పోర్టు హైవే పనులతో డ్రైనేజీ బ్లాక్

» వాహనదారులకు తప్పని ఇక్కట్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం చిన్నపాటి వర్షం కూడా కురవలేదు. కానీ చావులమదుం వద్ద మురుగునీరు ఉప్పొంగింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ద్విచక్రవాహనాలు కూడా ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కంచరపాలెం మెట్టు మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోర్టు నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారి నిర్మాణపనులు జరుగుతున్న విషయం తెలిసిందే. కంచరపాలెం, జ్ఞానాపురం, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల నుంచి మురుగునీరు చావులమదుం మీదుగా ఎర్రిగెడ్డ ద్వారా పోర్టు వద్ద సముద్రంలో కలుస్తుంది. అయితే పోర్టు వద్ద జాతీయరహదారి పను లు జరుగుతుండడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటం కం ఏర్పడింది. దీంతో నగరంలో నుంచి వచ్చే మురుగునీరు రివర్స్ అవడంతో లోతట్టు ప్రాంతమైన చావులమదుంను ముంచెత్తింది. వాహనాల రాకపోకలు స్తంభించడంతో జీవీఎంసీ, పోర్టు అధికారులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దీనిపై జీవీఎంసీ జోన్-4 ఈఈ కామేశ్వరరావు వద్ద ప్రస్తావించగా, పోర్టు జాతీయ రహదారి పనుల కారణంగా మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది ఎదురయిందని, బుధవారం నాటికి సమస్య పరిష్కారమవుతుందన్నారు.

కేజీహెచ్‌లో రోగులు, సహాయకులకు ఉచిత భోజనం

» ఏడాదిపాటు అందించనున్న ఇండో ఎంఐఎం సంస్థ

మహారాణిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో రోగులు, వారి సహాయకులకు మంగళవారం నుంచి ఏడాదిపాటు ఉచితంగా మధ్యాహ్న భోజనం అందించడానికి ఇండో ఎంఐఎం ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చింది. 2026 ఏప్రిల్ 14 వరకు మధ్యాహ్న భోజనానికి అయ్యే ఖర్చును భరిస్తామని ఆ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి విజయ్‌కుమార్ ప్రకటించారు. కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసుపల్లి రవికుమార్‌తో కలిసి మంగళవారమే ఈ మహత్కార్యాన్ని అమలుచేశారు. గత 13 సంవత్సరాలుగా కేజీహెచ్‌లో 'హరేకృష్ణా మూవ్‌మెంట్ అండ్ టచ్‌టోన్ చారిటీస్ సంస్థ ఆధ్వర్యంలో 'సుభోజనం' పేరిట రోగులు, వారి సహాయకులకు మూడు పూటలా అతి తక్కువ రుసుము (పూటకు కేవలం పది రూపాయలు) తీసుకుని భోజనాలు సమకూరుస్తోంది. ఈ కార్యక్రమం ప్రాముఖ్యత తెలుసుకొని అనేకమంది తమకు తోచిన సాయం చేస్తున్నారు. ఈ కోవలోనే ఇండో ఎంఐఎం సంస్థ మధ్యాహ్న భోజనానికి అయ్యే ఖర్చును భరించడానికి ముందుకు వచ్చింది. సంస్థ సీఈవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి మహత్కార్యంలో సంస్థ భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణా మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస, గోపీశ్వరదాస, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సంస్థ ప్రతినిధులు

అడ్వంచర్ స్పోర్ట్స్ ప్రాంగణాల్లో కమిటీ పర్యటన

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అడ్వంచర్ స్పోర్ట్స్ పేరుతో నిర్వహిస్తున్న ప్రాంగణాల్లో ఉన్న క్రీడలు, తీసుకున్న జాగ్రత్తలు, లోపాలపై అధ్యయనం చేసేందుకు కలెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీ మంగళవారం పలు కేంద్రాలను సందర్శించింది. రెవెన్యూ, పర్యాటకం, అగ్నిమాపక, పోలీసు అధికారులతో కూడిన ఈ బృందం పోర్టు స్టేడియంలోని కాశీ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించింది. అక్కడ క్రీడలు, పరిసరాలు, అనుమతులు పరిశీలించింది. జిల్లాలో అన్ని క్రీడా ప్రాంగణాలను పరిశీలిస్తున్నామని, ఆ తరువాత కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని అధికారుల బృందం తెలిపింది.



కాశీ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణే కీలకం

» పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ అంగముత్తు

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ అంగముత్తు సూచించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను పోర్టులో మంగళవారం ప్రారంభించారు. అగ్ని ప్రమాద సమయాల్లో సిబ్బంది స్పందించే తీరు ప్రశంసనీయమన్నారు. ముడిసరకు నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. పోర్టు ఫైర్ ఆఫీసర్ కె.కుమార్‌రాజు మాట్లాడుతూ గత ఏడాది పోర్టు పరిధిలో ఐదు, నగరంలో రెండు అగ్ని ప్రమాదాలు సంభవించగా తక్షణమే స్పందించి నష్టాన్ని తగ్గించామన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాల్లో అమరులైన వీర ఫైర్‌మన్‌ల స్థూపానికి అంగముత్తు పుష్పాంజలి ఘటించారు. అగ్ని సురక్షా కార్యక్రమాల్లో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దుబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పీఎస్ఎల్ స్వామి, డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టి.శ్రీనివాస్, పోర్టు విభాగాధిపతులు పాల్గొన్నారు.



వీర ఫైర్‌మన్‌లకు పుష్పాంజలి ఘటిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

యజమాని దాడి చేశాడంటూ క్యాబ్ డ్రైవర్ ఫిర్యాదు

సీతంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డులో ఉన్న వీఆర్ఎస్ ట్రావెల్స్‌లో పని చేస్తున్న తనను యజమాని దారుణంగా కొట్టి గాయపరిచాడని ఓ క్యాబ్ డ్రైవర్ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకి గంగాధర్ ట్రావెల్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాన్స్‌పోర్టు యజమాని విజయ్ 12న మినీ బస్సు బేరం రావడంతో డ్రైవర్ కాకి గంగాధర్‌ని పంపించాడు. శ్రీకాకుళం, అక్కడి నుంచి విజయవాడ, అక్కడి నుంచి విశాఖపట్నంకి బేరం పంపాడు. ఎలమంచిలి వచ్చేసరికి ఏసీ పాడైందంటూ బస్సు యజమానికి ఫోను చేసి చెప్పాడు. బాగుచేయించాక విజయవాడ చేరుకున్నాడు. అక్కడ కూడా ఏసీ మరమ్మతుకు గురికావడంతో బస్సు యజమానికి విషయం తెలియజేశాడు. ఏసీ బాగు చేయించమని యజమాని సూచించాడు. బేరం ముగిశాక బస్సు పెట్టడానికి మంగళవారం అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డుకి వచ్చాడు. బస్సు మైలేజ్ ఎందుకు రాలేదు? ఏసీ ఎందుకు పాడైందంటూ విజయ్ డ్రైవర్‌ను కోప గించుకున్నాడు. అనంతరం డ్రైవర్ గంగాధర్‌పై చేయి చేసుకున్నాడు. వీపుపై తట్లు తేరినట్లు యజమాని కొట్టాడని, తనకు న్యాయం చేయాలంటూ తోటి డ్రైవర్లతో కలిసి వచ్చి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.



నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ వద్ద దెబ్బలు తిన్న డ్రైవర్‌తో పాటు ఆందోళన చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

క్రైం... crime news

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



సాయిగణేశ్ (ఫైల్)

మల్కాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తండ్రి బైక్ కొనివ్వకపోవడంతో అలిగిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మల్కాపురం ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. కాలనీకి చెందిన కొనపిల్లి అప్పలరాజు రెండో కుమారుడు కొనపల్లి సాయిగణేష్ (20) కొద్దిరోజులుగా బైక్ కొనివ్వాలని కోరుతున్నాడు. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం కొనలేనని, తరువాత కొంటానని తండ్రి అప్పలరాజు సముదాయించాడు. మంగళవారం కూడా ఇదే పునరావృతం కావడంతో అలిగిన సాయి గణేష్ మేడపైకి వెళ్లి తాత్కాలికంగా నిర్మించుకున్న రేకుల షెడ్‌లోఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. అదే సమయంలో నాన్నమ్మ బొజ్జమ్మ టిఫిన్ కోసం పిలిచేందుకు వెళ్లగా వేలాడుతూ కనిపించాడు. తల్లిదండ్రులు వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వర్గాల నుంచి సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు మృతదేహాన్నిన పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఏఎస్ఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ మేడ పైనుంచి పడి వ్యక్తి మృతి

» మృతుడు దివీస్ ల్యాబొరేటరీలో ఫోర్‌మన్

భీమునిపట్నం (రూరల్) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మేడపై ఫోన్ మాట్లాడుతూ అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని చిప్పాడ దివీస్ ల్యాబొరేటరీ హాస్టల్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి... తూర్పుగోదావరి జిల్లా ముక్కామల గ్రామానికి చెందిన వేండ్ర మధుమోహన్ (24) చిప్పాడలోని దివీస్ కర్మాగారంలో ఫోర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని హాస్టల్‌లోని తన గదికి వచ్చాడు. అనంతరం ఫోన్‌లో మాట్లాడుతూ మేడపైకి చేరుకున్నాడు. అక్కడి నుంచి రాత్రి రెండు గంటల సమయంలో అదుపుతప్పి జారి పడిపోయాడు. సహచరులు గుర్తించి గాయపడిన మధుమోహన్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి మురళీమోహన్‌కు సమాచారం ఇచ్చారు. సీఐ తిరుమలరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

» నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేసిన పోలీసులు

మల్కాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై మల్కాపురం పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీహరిపురం బర్మాకాలనీకి చెందిన సివిల్ కాంట్రాక్టర్ అంగ కృష్ణ (55) ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక (11) వద్దకు మంగళవారం వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. పనిమీద బయటకు వెళ్లి, ఇంటికి తిరిగి వచ్చిన తండ్రిని తోసుకుంటూ కృష్ణ బయటకు వెళ్లిపోయాడు. అనుమానం వచ్చి బాలికను ప్రశ్నించగా జరిగిన విషయాన్ని చెప్పింది. బాలిక తల్లిదండ్రులు రోజూ పనుల కోసం బయటకు వెళ్తుండడంతో ఆమెను అమ్మమ్మ ఇంట్లో ఉంచుతారు. దీనిని ఆసరాగా తీసుకున్న కృష్ణ బాలికపై అనుచితంగా ప్రవర్తించాడు. గతంలోనూ ఇదే మాదిరిగా ప్రవర్తించాడని, ఎవరికైనా చెబితే అమ్మమ్మ, తండ్రి చనిపోయినట్టేనని ఒట్టు వేయించుకున్నట్టు బాలిక తెలిపింది. మల్కాపురం పోలీసులకు చేయడంతో సీఐ విద్యాసాగర్ అంగ కృష్ణను అదుపులోకి తీసుకుని, పోక్సో కేసు నమోదుచేశారు.

వృద్ధురాలి మెడలో 8 తులాల గొలుసు చోరీ



బాధితురాలు హేమలత

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు అడగడానికి వచ్చిన ఆగంతుకుడు వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు తెంచుకుని పారిపోయాడు. ఈ సంఘటన మద్దిలపాలెం చైతన్యనగర్‌లో జరిగింది. కాలనీకి చెందిన హేమలత వద్దకు ఓ ఆగంతుకుడు సోమవారం సాయంత్రం వచ్చి ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. సుమారు అర్ధగంట ఆమెతో మాట్లాడి వెళ్లిపోయాడు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో వచ్చి ఇల్లు చూపించాలని కోరాడు. ఆమె ఏమరపాటుగా ఉండడం గమనించి హేమలత మెడలో ఉన్న ఎనిమిది తులాల బంగారం గొలుసును తెం చుకుని పారిపోయాడు.ఈ క్రమంలో వృద్ధురాలిని తోసేయడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

గొలుసు దొంగల అరెస్టు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన గొలుసు చోరీ నిందితులను ఎంవీపీ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారమే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నా అధికారికంగా వెల్లడించలేదు. విజయవాడకు చెందిన నిందితులు అక్కడ ఓ బైకును చోరీ చేసి, విశాఖ వచ్చారు. శివాజీపాలెం సమీపంలోని ఓ ఇంటికి వెళ్లి, మంచినీరు అడిగి, మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యారు. సీసీ ఫుటేజీ, ఓ లాడ్జిలో గుర్తింపు పత్రాలు లేకుండా దిగినా, ఫోన్ పే ద్వారా చెల్లింపులు జరపడంతో పోలీసులు వారిని విజయవాడలో అరెస్టుచేసి, రిమాండుకు తరలించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

» 20 బైకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు



పట్టుబడిన బైకులతో డీసీపీ లతా మాధురి, సిబ్బంది

పెందుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఘరానా దొంగను పెందుర్తి పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, 20 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పెందుర్తిలో క్రైం డీసీపీ కె.లతామాధురి వివరాలు వెల్లడించారు. స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన అంపోలుకిశోర్‌కుమార్ (40) జల్సాలకు అలవాటు పడి, పగలు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో ద్విచక్రవాహనాలను చోరీ చేసేవాడు. ఈ బైకులకు తప్పుడు పత్రాలు సృష్టించి ఒడిశాలో విక్రయించేవాడు. ఇటీవల పెందుర్తి రాతిచెరువుకు చెందిన మురాల చంద్రశేఖర్ తన ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి.సూరిబాబు పాత నేరస్థుడు అంపోలు కిశోర్‌కుమార్ కదిలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో రాయగడలో చోరీ చేసిన బైక్‌ను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. విచారణలో 20 బైకులు చోరీ చేసినట్టు అంగీకరించాడు. నిందితుడిపై పలు చైన్‌స్నాచింగ్ కేసులున్నాయని, పెందుర్తి, విశాఖ ఫోర్త్, ఫిష్ టౌన్, కంచరపాలెం, కొత్తవలస స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయని, ఓ కేసులో పది నెలలు జైలు శిక్ష అనుభవించాడన్నారు. కేసును ఛేదించిన ఎస్ఐ సూరిబాబు, ఏఎస్ఐ మూర్తి, హెచ్‌సీ నాగరాజు, పీసీలు కిశోర్, పైడిరాజు, దేవుడునాయుడు, నితీశ్‌కుమార్, హైమావతిలను ఈ సందర్భంగా డీసీపీ అభినందించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీతంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అబీద్‌నగర్ సమీపంలో ఈ నెల 13న ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని ఆరు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ శాంతారామ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణ ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన బసంత్‌కుమార్ ఖరా గంజాయి సంచులతో పట్టుబడ్డాడు. అతనిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.